



యు.కొత్తపల్లిలో సిద్ధమవుతున్న ఐఐఎఫ్‌టీ శాశ్వత క్యాంపస్

# నేడు నల్లజర్లకు సీఎం చంద్రబాబు రాక

రాజమహేంద్రవరం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు రాకకు నల్లజర్ల ముస్తాబైంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రైతన్న మీకోసం కార్యక్రమంలో సీఎం పాల్గొననున్నారు. ఈ మేరకు తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సీఎం చంద్రబాబు బుధవారం ఉదయం 10.30గంటలకు ఉండవల్లిలోని నివాసం నుంచి హెలి కాప్టర్‌లో బయలుదేరి 10.55 గంటలకు నల్లజర్లలోని హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. 11.10 గంటలకు అధికారులు, ప్రజాప్రతినిధులు స్వాగతం పలుకుతారు. అక్కడి నుంచి కారులో బయలుదేరి 11.30గంటలకు నల్లజర్లలో వ్యవసాయ భూమి పరిశీలనకు వెళ్తారు. 11.30 నుంచి 11.50 వరకూ స్టాల్స్‌ను సందర్శిస్తారు. కలెక్టర్ స్వాగత ప్రసంగం చేస్తారు. 12.15 నుంచి 12.20 వరకూ గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ప్రసంగిస్తారు. సీఎం చంద్రబాబు 12.55 గంటల వరకూ 1000 మంది రైతులతో ముఖాముఖి నిర్వహిస్తారు. వేదికపై ఏర్పాటు చేసిన మంచంపై కూర్చుని రైతులు, వారి కుటుంబాలతో కూడా మాట్లాడతారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడతారు. తర్వాత మధ్యాహ్నం 1.30 గంటల వరకూ విశ్రాంతి తీసుకుంటారు. 1.45 నుంచి 3.15 గంటల వరకూ గోపాలపురం నియోజకవర్గ పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు. సాయంత్రం 3.20 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 3.30 గంటలకు హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. 3.40 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి ఉండవల్లి వెళ్తారు. కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ పెద్దసంఖ్యలో రైతులు పాల్గొంటున్న నేపథ్యంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేశామన్నారు. ప్రజావేదిక వద్ద ఐదు స్టాల్స్ ఏర్పాటు చేశామన్నారు. సభలో రైతులు, వ్యవసాయం, హార్టీకల్చర్, మత్స్యశాఖ అధికారులు పాల్గొంటారని తెలిపారు. బందోబస్తు ఏర్పాట్లను ఏలూరు రేంజ్ ఐజీ జీవీకే అశోక్‌కుమార్, ఎస్పీ డి.నరసింహ కిశోర్ పరిశీలించారు. 1200మందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్టు ఎస్పీ తెలిపారు. పర్యటన సజావుగా సాగేలా సభావేదిక, హెలిప్యాడ్ తదితర ప్రాంతాల్లో ముందస్తు ఏర్పాట్లు, భద్రత చర్యల గురించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేష్, ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, జేసీ వై.మేఘ స్వరూప్, ఆర్డీవో రాణి సుస్మిత, డీఎస్పీ దేవకుమార్ క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు పరిశీలించారు.



కాకినాడ పెద్దాసుపత్రిలో జ్వరపీడితులు

# ఆసుపత్రుల క్యూ!

## ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న జ్వరపీడితులు

### ఫీవర్స్.. వైరల్!



అమలాపురం మండలం బండారులంకలో ఫీవర్ సర్వే

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో జ్వర పీడితులు పెరుగుతున్నారు. చిన్న,పెద్ద, తేడా లేకుండా వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్నారు. గత వారం రోజులుగా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో భారీగా కేసులు నమోదవుతున్నాయి. సాధారణంగా కాకినాడ జీజీహెచ్‌కు ప్రతి రోజూ 2 వేలకు పైగా ఓపీ ఉంటుంది.వీరిలో జ్వర పీడితులే అధికంగా ఉంటున్నారు. రాజ మహేంద్రవరం జీజీహెచ్‌లో ప్రతిరోజూ సుమారు వెయ్యి నుంచి 1200ల వరకూ ఓపీ ఉంటే వీరిలో ఎక్కువ మంది సీజనల్ వ్యాధులతోనే ఆసుపత్రికి వస్తున్నట్టు జనరల్ మెడిసిన్ వైద్యులు చెబుతున్నారు. కోనసీమలోనూ ఇదే పరిస్థితి ఉంది. గ్రామీణ ప్రాంత ప్రజలు జ్వరం, దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులు, గొంతు నొప్పి లక్షణాలతో ఆసుపత్రులకు వస్తున్నారు. ఇంట్లో ఒకరి తర్వాత ఒకరు విషజ్వరాల బారిన పడుతున్నారు. ప్లేట్‌లెట్స్ తగ్గిపోవడంతో నీరసించి పోతున్నారు.జ్వరం తగ్గినా ఒళ్లు నొప్పులు, జలుబు, దగ్గు మాత్రం తగ్గడం లేదని మళ్లీ ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు.అసలే జ్వరంతో రోగులు బాధపడుతుంటే రకరకాల టెస్టులతో ప్రైవేటు ఆస్పత్రుల డాక్టర్లు మరింత నీరసించేలా చేస్తున్నారు.రక్త, బీపీ, షుగర్ టెస్టులతో పిండేస్తున్నారు. పలువురు ఆసుపత్రులకు వెళ్లేం దుకే భయపడుతున్నారు.

**సీజన్ మారింది. చలిగాలుల తాకిడి అధికమైంది. తుఫాన్ ప్రభావంతో ఒక వైపు వానలు కురుస్తున్నాయి. వృద్ధులు, చిన్నారులు అధికంగా జ్వరాల బారిన పడుతున్నారు. శ్వాసకోశ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. గాలిలో వైరస్ కారణంగా చికెన్ ఫాక్స్, విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు జ్వరం, దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పు లు, గొంతు నొప్పి, కీళ్ల నొప్పులు, తలనొప్పి వంటి లక్షణాలతో క్యూ కడుతున్నారు. కొన్ని నెలలుగా డెంగీ, మలేరియా కేసులు నమోదవుతుండగా స్క్రబ్ టైఫస్ కేసులు ఆందోళన కలిగిస్తున్నాయి.**

- కాకినాడ/ అమలాపురం/రాజమహేంద్రవరం అర్బన్(ఆంధ్రజ్యోతి)

### కాకినాడలో స్క్రబ్ టైఫస్..

ఈ ఏడాది జనవరి నుంచి పరిశీలిస్తే కాకినాడలో ఐదు వేల మందికి వైద్యపరీక్షలు నిర్వహించగా 200కిపైగా డెంగీ కేసులు నమోదయ్యాయి. నాలుగు నెలలుగా కేసులు పెరుగుతూ వస్తున్నాయి. జిల్లాలో స్క్రబ్ టైఫస్ కేసులు కలవరపెడుతున్నాయి. నల్లి లాంటి ఓ కీటకం కుట్టడం ద్వారా కుట్టినచోట దద్దుర్లు, నల్లటి మచ్చలు ఏర్పడడం, జ్వరం, వాంతులు, తల, ఒంటి నొప్పులు, పొడి దగ్గు లక్షణాలతో ఆస్పత్రికి వచ్చేవారు అధికమయ్యారు. లాలాజలంతో ఈ ఇన్ఫెక్షన్ ఒకరి నుంచి మరొకరికి సోకుతున్నట్టు వైద్యులు ప్రాథమికంగా గుర్తించారు. కాకినాడ జిల్లాలోనే అత్యధికంగా 1452 మందికి పరీక్షలు చేయగా 148 కేసులు నమోదయ్యాయి. కాకినాడ, అర్బన్, గ్రామీణ ప్రాంతాలతో పాటు సామర్లకోట, పెద్దాపురం తుని, ప్రత్తిపాడు ప్రాంతాల నుంచి ఎక్కువ కేసులు వచ్చాయి. మిగతా మండలాల్లోను ఈ వ్యాధి బాధితులు ఉన్నారు. గత నెల నవంబర్‌లో 251 మందిని పరీక్షించగా 47మంది ఈ వ్యాధికి గురయ్యారు.

- ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న కేసులు
- వైరల్, డెంగీ జ్వరాలతో ఇక్కట్లు
- కాకినాడలో స్క్రబ్ టైఫస్ కేసులు
- తూర్పు, కోనసీమల్లో డెంగీ

### స్క్రబ్ టైఫస్ సోకితే ఐదు రోజులు వైద్యం

స్క్రబ్ టైఫస్ సోకడానికి పరిసరాల అపరిశుభ్రతే కారణం. ఇంటి పరిసరాలు, పనిచేసే ప్రాంతాలు శుభ్రంగా ఉంచుకోవాలి. తుప్పల వద్ద జాగ్రత్తగా ఉండాలి. వ్యాధి సోకితే నివారణకు ఐదు రోజుల పాటు వైద్యం తీసుకోవాలి.

**- డాక్టర్ ప్రభాకర్, కాకినాడ మలేరియా అధికారి**

### కోనసీమలో డెంగీ

కోనసీమ జిల్లాలోనూ జ్వరపీడితులు ఉన్నారు. గతేడాది జిల్లాలో 292 డెంగీ కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది ఇప్పటివరకు 34 కేసులు నమోదయ్యాయి. వైరల్ జ్వరాల బారిన పడినవారు గతంలో రోజువారీ నివేదికల్లో 250 మంది ఉండేవారు. ప్రస్తుతం రోజుకు 170 నుంచి 180 మంది ఉంటున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు నాలుగు మలేరియా కేసులు నమోదయ్యాయని జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు వెల్లడించారు. నవంబరులో అమలాపురం ఏరియా ఆసుపత్రిలో అవుట్ పేషెంట్ విభాగంలో 61మందిని జ్వర పీడితులుగా గుర్తించారు. మరో 15 మంది ఆసుపత్రిలో చేరి వైద్యం చేయించుకున్నారు. ప్రస్తుతం రోజుకు ఇద్దరు, ముగ్గురు మాత్రమే వైరల్ జ్వరాల బారిన పడుతున్నారు. ఒక డెంగీ కేసుకు ఆస్పత్రిలో వైద్యం చేయగా ఇద్దరు ఓపీ విభాగంలో డెంగీ పాజిటివ్‌గా గుర్తించామని అమలాపురం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు వెల్లడించారు. జిల్లాలో స్క్రబ్ టైఫస్ కేసులేమీ నమోదుకాలేదని డీఎంహెచ్‌వో దుర్గారావురావు వెల్లడించారు.

### 'తూర్పు'న ఇలా..

తూర్పుగోదావరి జిల్లాలో మలేరియా, న్యుమోనియా, డెంగీ కేసులు నమోదవుతున్నాయి. ఇన్‌పేషెంట్ కేసులు తక్కువగానే ఉన్నా అవుట్‌పేషెంట్లు ఎక్కువ మంది ఉంటున్నారు. పిడియాట్రిక్ విభాగంలో శ్వాసకోశ సంబంధిత సమస్యలతో చిన్నారులు వైద్యానికి వస్తున్నారు. జ్వరకేసులు నమోదవుతున్నాయి. పక్కనున్న ఏఎస్ఆర్ జిల్లా నుంచి మలేరియా కేసులు వస్తున్నాయని.. తూర్పుగోదావరి జిల్లాలో మాత్రం జీరో అని వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు. రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో గోకవరం, నామవరం తదితర ప్రాంతాల నుంచి వచ్చిన జ్వరపీడితుల్లో కొందరికి ఇక్కడి వైద్యులు ప్రాథమికంగా మలేరియాగా నిర్ధారించినట్టు తెలిసింది. రాజమహేంద్రవరం, కొవ్వూరు డివిజన్లలో డెంగీ కేసులు మాత్రం 32 నమోదైనట్టు లెక్కలు చెబుతున్నారు.

### ప్రత్యేక వైద్యం అందిస్తున్నాం

స్క్రబ్ టైఫస్‌పై ప్రత్యేక దృష్టిసారించాం. గ్రామాల్లో అవగాహన కల్పి స్తున్నాం. జిల్లాలో జ్వర బాధితులకు ప్రత్యేక వైద్యం అందిస్తు న్నాం. సీహెచ్‌సీలు, పీహెచ్‌సీల్లో నిత్యం వైద్యపరీక్షలు జరుగుతున్నాయి. అజిత్రోమైసిన్, డాక్సీసైక్లిన్ మందులను అందుబాటులో ఉంచాం. ఎక్కడైనా జ్వరపీడితులు పెరిగితే సమాచారం ఇవ్వాలి.

**- నరసింహనాయక్, డీఎంహెచ్‌వో, కాకినాడ జిల్లా**

# నాడు గాలికి.. నేడు దారికి..

- కాకినాడలో నెరవేరబోతున్న విభజన హామీ కల
- ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ క్యాంపస్‌కు తీరిన నిధుల బెంగ
- సవరించిన రాష్ట్రప్రభుత్వ వాటా కింద రూ.57.10కోట్లు మంజూరు

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

కాకినాడలో విభజన హామీ కల నెరవేరబోతోంది.ప్రతిష్టాత్మకమైన ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫారెన్ ట్రేడ్ క్యాంపస్‌కు శాశ్వత భవనం సమకూరబోతోంది. సాధ్యమైనంత వేగంగా అత్యాధునిక సదుపాయాలతో సొంత క్యాంపస్‌లో చదువులు ప్రారంభం కాబోతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో నిధులు ఇవ్వకపోవడంతో పనులు ఆగిపోయాయి. ప్రభుత్వం మారాక మళ్లీఐఐఎఫ్‌టీకి మంచిరోజులు వచ్చాయి. సవరించిన వాటా కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.57.10కోట్లు మంజూరు చేస్తూ మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. దీంతో మరి కొద్దినెలల్లో క్యాంపస్‌ను పూర్తి చేసి అందులో బోధన కొనసాగించబోతున్నారు. కాగా రాష్ట్ర విభజన సమయంలో కాకినాడలో రూ.229కోట్లతో ఐఐఎఫ్‌టీ క్యాంపస్ ఏర్పాటు చేస్తున్నట్లు అప్పట్లో కేంద్రప్రకటించింది. అటు ఇందులో చదువు పూర్తిచేసిన వారికి ఏటా కోట్ల వేతనంతో ప్లేస్‌మెంట్లు లభించనున్నాయి.

### నాడు గాలికి వదిలేశారంతే..

రాష్ట్ర విభజన సమయంలో అప్పటి కేంద్ర ప్రభుత్వం ఏపీలో ఒక్కో జిల్లాకు ఒక్కో కీలక ప్రాజెక్టు ప్రకటించింది. ఇందులోభాగంగా కాకినాడలో ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫారన్‌ట్రేడ్ క్యాంపస్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. ఒక్కో దానికి రూ.150కోట్లు ఇస్తామని మాటఇచ్చింది. తద్వారా ఈ రెండు క్యాంపస్‌ల రాకతో యువతకు ఉద్యోగావకాశాలు,పరిశ్రమలకు ఎంతో ఉపయోగకరంగా ఇవి ఉంటాయని అంతా భావించారు. దీనికి తగ్గట్లే 2014 తర్వాత ఈ రెండింటికీ అప్పటి బడ్జెట్‌లో కేంద్రం చెరో రూ.10కోట్లు కేటాయించింది. అప్పట్లో కాకినాడ సెజ్‌లో ఈ రెండు విద్యాసంస్థల ఏర్పాటుకు స్థలం గుర్తించారు. రెండింటికీ కలిపి సెజ్‌లో చెరో 25ఎకరాలు సిద్ధం చేశారు. కానీ ఆ తర్వాత నుంచీ ఐఐఎఫ్‌టీకి నిధుల విడుదల ఆగిపోయింది. అప్పటి టీడీపీ ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవడంతో కొంతవరకు ప్రయత్నాలు ఫలించాయి. యు.కొత్తపల్లి మండలం పొన్నాడలో శాశ్వత భవనం నిర్మాణానికి అడుగులు పడ్డాయి. రూ.229కోట్ల వ్యయమయ్యే ఈ క్యాంపస్ నిర్మాణానికి కేంద్రం 50శాతం, రాష్ట్రప్రభుత్వం 35శాతం, 15శాతం నిధులను బయట పరిశ్రమలసహకారంతో భరించేలా జరిగిన ఒప్పందం ప్రకారం కేంద్రం కొంత నిధులు ఇవ్వడంతో పనులు ఊపందుకున్నాయి. ఆ తర్వాత ప్రభుత్వం మారి వైసీపీ అధికారంలోకి రావడంతో క్యాంపస్ నిర్మాణానికి గ్రహణం పట్టింది.కేంద్రంనుంచి తన వాటా నిధులు మంజూరైనా జగన్ సర్కారు వాటిని దారి మళ్లించింది. తన వాటా కింద విడుదల చేయాల్సిన 35శాతం నిధులు కూడా ఇవ్వలేదు. దీంతో యు.కొత్తపల్లిలోక్యాంపస్ నిర్మాణం పడకేసింది. అదే సమయంలో తన నిర్వాకం బయట పడకుండా ఉండేందుకు సర్కారు 2022లో ఐఐఎఫ్‌టీ క్యాంపస్‌ను జేఎన్టీయూలో తాత్కాలికంగా కొనసాగేలా నిర్ణయించి కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో ప్రారంభింపజేశారు.

### కోర్సు పూర్తయితే కోట్లే..

ప్రస్తుతం తాత్కాలికంగా జేఎన్టీయూలో కొనసాగుతోన్న ఈ క్యాంపస్‌లో చాలినంత స్థలం,సదుపాయాలు లేక మొక్కుబడిగా చదువులు సాగుతున్నాయి. ఇందులోభాగంగా ఇప్పుడు ఇందులో ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రాం ఇన్‌మేనేజ్‌మెంట్ కింద బిజినెస్ అనలిటిక్స్ అండ్ ఎంబీఏ ఇంటర్నేషనల్ బిజినెస్ కోర్సు మాత్రమే నిర్వహిస్తున్నారు. శాశ్వత భవనంలోకి క్యాంపస్ వచ్చాక కోర్సులు భారీగా పెరగనున్నాయి.కాకినాడతో కలిపి దేశంలో నాలుగే ఐఐఎఫ్‌టీలున్నాయి. ఇక్కడ విద్య పూర్తిచేసినవారికి రూ.1.23కోట్ల నుంచి రూ.అరకోటివరకు వివిధ కంపెనీలు క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో ఆకర్షణీయ జీతాలు ప్రకటించాయి.

### దారికి తెచ్చి.. నిధుల బెంగ తీర్చి..

రాష్ట్రంలోప్రభుత్వం మారడంతో ఐఐఎఫ్‌టీ క్యాంపస్‌కు మంచిరోజులు వచ్చినట్లయింది. కేంద్రంలో ప్రభుత్వానికి టీడీపీ మద్దతుగా నిలబడడం, రాష్ట్రంలో కూటమి అధికారంలో ఉండడంతో నిధుల సమస్య తీరింది. ఇప్పటివరకు బిల్లులు మంజూరవడంతో గతేడాదిన్నరగా శాశ్వత క్యాంపస్ పనులు చకచకా జరుగుతున్నాయి. మిగిలి ఉన్న పనులకు సంబంధించి కావాల్సిన నిధుల సర్దుబాటు పూర్తిస్థాయిలో లేకపోవడంతో కొన్నినెలలుగా ఇబ్బందులు తలెత్తాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం జోక్యం చేసుకుని కీలక నిర్ణయం తీసుకుంది. 15శాతం వాటా నిధులను భరించడానికి సీఎం చంద్రబాబు తాజాగా అంగీకరించారు. ఈమేరకు 50:50 విధానం కింద రాష్ట్రప్రభుత్వమే ఆ నిధులు ఇవ్వడానికి పచ్చ జెండా ఊపింది. ఈ మేరకు రాష్ట్ర పరిశ్రమలశాఖ జీవోఆర్టీ నెంబరు 210 జారీ చేసింది. దీంతో ఐఐఎఫ్‌టీ క్యాంపస్‌కు అతి త్వరలో శాశ్వత భవనం సిద్ధం కానుంది.

# వెన్నాడుతున్న వర్షం

- తడిచిన ధాన్యం మొలకెత్తే ప్రమాదం
- నేలకొరిగిన వరి పంటకు నష్టం తప్పదని రైతుల్లో కలవరం



పిఠాపురం-గొల్లప్రోలు మధ్య 216 హైవేపై వర్షంలో బరకాలు కప్పిన ధాన్యం రాశులు

(పిఠాపురం/గొల్లప్రోలు/సామర్లకోట-ఆంధ్రజ్యోతి)

దిత్వా తుఫాన్ బలహీనపడినప్పటిక దాని ప్రభావం కొనసాగుతోంది. కాకినాడ జిల్లావ్యాప్తంగా మంగళవారం రోజంతా ముసురు వాతావరణం నెలకొనగా అక్కడక్కడా వర్షం కురిసింది. తడిసిన ధాన్యం రాశులు, వరి పనలు మొలకెత్తే ప్రమాదం పొంచి ఉండడంతో రైతులు కలవరానికి గురవుతున్నారు. ధాన్యం రంగు మారుతుందన్న ఆందోళనవారిలో వ్యక్తమవుతోంది. జిల్లాలోని ఏలేరు, పీబీసీ, పంపా, తాండవ ఆయకట్టు ప్రాంతాల్లో వర్షాలుపడ్డాయి. సోమవారం కురిసిన వర్షానికే పలుచోట్ల ధాన్యం రాశులు, వరిపనలు తడవగా రైతులు వాటిని ఆరబెట్టుకున్నారు. మంగళవారం ఉదయం ధాన్యంరాశులు ఆరబెడదామని భావించేలోగానే వర్షం పడడంతో బరకాలు, టార్పాలిన్లు కప్పారు. కత్తిపూడి-చేబ్రోలు-గొల్లప్రోలు-పిఠాపురం-చిత్రాడ-తిమ్మాపురం మధ్య 216 జాతీయ రహదారి, చేబ్రోలు-మల్లవరం, పిఠాపురం-సామర్లకోట రోడ్ల వెంబడి ఆరబోసిన ధాన్యం రాశులపై టార్పాలిన్లు, బరకాలు కప్పినప్పటికీ నీరు లోపలకు చేరింది. పలు ప్రాంతాల్లో రైతులు వర్షం విరామం ఇవ్వగానే ధాన్యాన్ని మిల్లులకు తరలించే ప్రయత్నం చేస్తున్నారు. సామర్లకోట, గొల్లప్రోలు, సీతానగరం, లక్ష్మీపురం, మల్లవరం, పిఠాపురం, బి.ప్రత్తిపాడు, భోగాపురం, రాపర్తి తదితర ప్రాంతాల్లో కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట నేల కొరిగింది. దానిపై వర్షం కురవడంతో గింజలు మొలకెత్తే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

### అటు ముసురు.. ఇటు చలి

పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాల్లో ప్రధాన రోడ్లపై వర్షపునీరు నిలిచిపోయింది. ఒకవైపు ముసురు వాతావరణం, మరోవైపు చలి తీవ్రతతో రోడ్లపై జనసంచారం అంతంతమాత్రంగానే ఉంది. పగటిపూట కూడా స్వెట్టర్లు, మంకీ క్యాప్‌లు, ఇతర రక్షణ దుస్తులు వేసుకుంటే గానీ బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. వర్షం లేకుండా పొగ మంచు రహదారులను కమ్మేసింది.



కాకినాడ నగరంలో కురుస్తున్న వర్షం

# కాకినాడ కార్పొరేషన్ ఆదాయం పెంపుపై దృష్టి

- నగర ప్రజల ఆహ్లాదం కోసం పలు ప్రాజెక్టులకు శ్రీకారం
- కుళాయి పన్ను బకాయిదారులు 10లోగా పన్నులను చెల్లించాలి.. లేకుంటే కనెక్షన్ తొలగింపు
- కార్పొరేషన్ అధికారులతో సమావేశంలో కలెక్టర్ షాన్‌మోహన్



కాకినాడ నగరపాలక సంస్థ అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

కార్పొరేషన్(కాకినాడ), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరపాలక సంస్థ ఆదాయాన్ని గణనీయంగా పెంచేందుకు త్వరలోనే కఠినమైన చర్యలు తీసుకోనున్నట్టు జిల్లా కలెక్టర్, కాకినాడ నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి షాన్‌మోహన్ వెల్లడించారు. కాకినాడ శారదమ్మగుడి సమీపంలోని మున్సిపల్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ కమిషనర్ ఎన్‌వీవీ సత్యనారాయణతో కలిసి అధికారులతో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ, హెల్త్, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగాల ద్వారా కార్పొరేషన్‌కు వచ్చే ఆదాయ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇతర అంశాలు పక్కనపెట్టి కార్పొరేషన్‌కి ఆదాయం పెంపొందించుకునే మార్గాలపై దృష్టిపెట్టాలని ఆదేశించారు. రాష్ట్రంలోని ఇతర మున్సిపల్ కార్పొరేషన్లతో పోలిస్తే కాకినాడలో ఆదాయం తక్కువగా ఉండడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ప్రత్యేకంగా కుళాయిల పన్ను బకాయిలు భారీగా పెరిగిన నేపథ్యంలో వెంటనే వసూళ్లపై దృష్టి పెట్టాలని సూచించారు. కాకినాడ నగరంలో అన్‌ఆథరైజ్డ్‌గా ఉన్న కుళాయిలు అధికంగా ఉన్నాయని, వాటిని ఈ నెల 10వతేదీలోగా రెగ్యులరైజ్ చేసుకుని పన్నులను చెల్లించాలని, 11వతేదీ నుంచి బకాయిదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అవసరమైతే తాగునీటి కుళాయిలను తొలగించడానికి వెనుకాడవద్దని స్పష్టం చేశారు. అదనంగా ట్రేడ్ లైసెన్స్ రుసుముల్లో స్వల్ప పెంపు ప్రతిపాదన అమలుకు దిశానిర్దేశం చేశారు. ఇక పార్కులు, ఉద్యానవనాలు, ఎన్టీఆర్ బీచ్ అభివృద్ధికి పలు సంస్థలు సమర్పించిన ఆధునిక సదుపాయాల ప్రణాళికలు కూడా సమావేశంలో చర్చించారు. పార్కుల్లో ఫుడ్ కోర్టులు. ఎగ్జిబిషన్ ప్రాంగణాలు, నెట్ క్రికెట్, గో-కార్ట్‌ట్రాక్‌లు, ఎమ్యూజ్‌మెంట్ పార్క్‌లు వంటివి ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు వినోదం-కార్పొరేషన్‌కు ఆదాయం రెండూ పెరుగుతాయని అభిప్రాయపడ్డారు. జనవరి నెలలో సంక్రాంతి ఉత్సవాల భాగంగా కాకినాడ జగన్నాథపురం రెండు బ్రిడ్జిల మధ్య యేటి కాలువలో బోట్ల పోటీలను నిర్వహించేందుకు ముందుకు వచ్చిన నిర్వాహకుల ప్రతిపాదనను ఆయన పరిశీలించారు. ఎన్టీఆర్ బీచ్‌లో ఇప్పటికే నిర్వహిస్తున్న గోకార్టింగ్ సంస్థ ప్రతినిధి ఆనంద్ కూడా సమావేశంలో పాల్గొని నగరంలో పార్కుల అభివృద్ధికి రూపొందించిన ప్రణాళికను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ టెండర్ విధానం ద్వారా పార్కుల అభివృద్ధికి మౌలిక సదుపాయాల కల్పనకు ముందుకు వచ్చేవారికే పార్కుల నిర్వహణ బాధ్యతలను అప్పగిస్తామన్నారు. ప్రజలకు పార్కుల్లో యథావిధిగా అనుమతులు ఇస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు కమిషనర్ కేటీ సుధాకర్, డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాస్, ఎస్ఈపీ వెంకట్రావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీచరణ్, డీసీప కృష్ణారావు, అకౌంటెంట్ రామశాస్త్రి, టీపీఆర్‌వో శైలజ పాల్గొన్నారు.

### 5న బాధ్యతలు స్వీకరించనున్న జేసీ

కలెక్టరేట్(కాకినాడ),డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి):ఈనెల 5న జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వభరత్ బాధ్యతలు స్వీకరించనున్నారు. అక్టోబరు 9న ఐఏఎస్ బదిలీల్లో భాగంగా ఎటపాక సబ్‌కలెక్టర్‌గా పనిచేస్తున్న ఆయన్ను జిల్లా జేసీగా ప్రభుత్వం నియమించింది. ఆయన ప్రత్యేక శిక్షణ నిమిత్తం ఉత్తరాఖండ్‌లోని ముస్సోరి వెళ్లడంవల్ల ఇప్పటివరకు జేసీగా బాధ్యతలు స్వీకరించలేదు. శిక్షణ ముగియడంతో ఆయన ఈనెల 5న జేసీగా బాధ్యతలు స్వీకరించనున్నట్లు కలె క్టరేట్ అధికారులు వెల్లడించారు.

### పనితీరులో ఎంపీకి రెండోస్థానం

కలెక్టరేట్(కాకినాడ),డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో కూటమిఎంపీల పనితీరుపై పూణేకు చెందిన సెంటర్ ఫర్ పబ్లిక్ ఒపీనియన్ అండ్ సెఫలాజికల్ సంస్థ చేపట్టిన సర్వేలో ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్‌కు రెండోస్థానం వచ్చినట్లు ఎంపీ క్యాంపు కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ సందర్భంగా జనసేన నాయకులు, కార్యకర్తలు ఆయనకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

# ఉద్యోగాల పేరుతో బురిడీ

- రూ.15-రూ.35 వేలు జీతం అంటూ ప్రకటనలు
- ట్రాప్‌లో పడినవారి పేరుతో బ్యాంకు ఖాతాలు
- సైబర్ నేరాల సొమ్ము వాటిలో జమ
- ఏడాది కాలంలో రూ.75 లక్షలు మోసం
- కర్ణాటక, ఏపీలకు చెందిన 8 మంది అరెస్టు

మెయిన్‌లో..



పోలీసులు స్వాధీనం చేసుకున్న వస్తువులు

# సామర్లకోట భీమేశ్వరుడి ఆదాయం రూ.1.05కోట్లు

సామర్లకోట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): సామర్లకోట కుమారరామ భీమేశ్వరునికి కార్తీకమాసంలో రూ.1.05కోట్ల ఆదాయం లభించింది. ఆలయంలో హుండీలను ఈవో బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ధర్మకర్తల మండలి చైర్మన్ కంటే జగదీష్‌మోహన్(బాబు), సభ్యుల పర్యవేక్షణలో మంగళవారం తెరిచి లెక్కించారు. దేవదాయ తనిఖీ అధికారి వడ్డి ఫణికుమార్ హాజరయ్యారు. దర్శన టిక్కెట్ల ద్వారా రూ.36,29,398, కానుకల ద్వారా రూ.38,015, ప్రసాదాల ద్వారా రూ.12,86,855, ఆర్జిత సేవల ద్వారా రూ.3,20,000, స్వామివారి ఫొటోల విక్రయం ద్వారా రూ.11,540, ఆన్‌లైన్ విరాళాల ద్వారా రూ.7,94,876, నిత్యాన్నదాన విరాళాల ద్వారా రూ.22,29,398, హుండీల ద్వారా రూ.22,37,942 లభించాయి. అర్చకులు, ఆలయ సిబ్బంది, సామర్లకోట రెవెన్యూ సిబ్బంది, సత్యదుర్గ హరిహర సేవా సంఘం (జగ్గంపేట), ఆర్యవైశ్య సేవా సంఘం(సామర్లకోట), శ్రీరామ సేవా సంఘం (పిఠాపురం)లకు చెందిన భక్తులు పాల్గొన్నారు.



భీమేశ్వరాలయ హుండీలు లెక్కిస్తున్న భక్తులు



విద్యార్థులకు ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్న దృశ్యం

వారంతా దివ్యాంగులు. విభిన్న ప్రతిభావంతులు, బుద్ధి మాంద్యం, వికలత్వం కలవారు. కుటుంబీకుల సహకారం లేనిదే కాలకృత్యాలు తీర్చుకోలేరు. అలాంటి వారి జీవితాల్లో వెలుగులు నింపుతోంది ఉమా మనో వికాస కేంద్రం. ఇది ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో గత 37 ఏళ్లుగా వేలాది మందికి సేవలందిస్తోంది. ఈ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌పి రెడ్డి దివ్యాంగుల సాధికారితే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. నేడు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం...



# దివ్యాంగుల మనో నేత్రం



చిన్నారుల ఆట, పాట

## ఉమా వికాస కేంద్రం

- దివ్యాంగులు, విభిన్న ప్రతిభావంతులు, ప్రత్యేక అవసరాల పిల్లలకు ఆసరా
- 1988లో కాకినాడలో ప్రస్థానం
- 37 ఏళ్లుగా విశేష సేవలు
- రెండు సార్లు రాష్ట్రపతి, ఆరుసార్లు జాతీయ పురస్కారాలు

(సర్పవరం జంక్షన్ (కాకినాడ)-ఆంధ్రజ్యోతి)

దివ్యాంగులు, విభిన్న ప్రతిభావంతులు, ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ఆరోగ్యం, విద్య, జీవనోపాధి, సాంఘిక సాధికారిత, పునరావాసం కల్పించేందుకు 1988లో కాకినాడలో ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ (ఉమా మనో వికాస కేంద్రం)ని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌పీ రెడ్డి స్థాపించారు. తొలుత బుద్ధి మాంద్యత గల 9 మంది పిల్లలతో ప్రారంభమైన ఈ సంస్థ నేడు వేలాది మంది విద్యార్థులకు ఆరోగ్యం, ప్రత్యేక విద్య, సమీకృత, వృత్తి విద్యనందిస్తోంది. సాంస్కృతిక, సాంఘికపరమైన శిక్షణ ఇస్తూ జీవనోపాధికి అవకాశాలు కల్పిస్తోంది. కాకినాడ, తూర్పుగోదావరి, ఏలూరు, ప్రకాశం జిల్లాలతో పాటు యానాంలో నిర్వహిస్తున్న కార్యకలాపాలకు గుర్తింపుగా ఎస్‌పి రెడ్డి రెండు సార్లు రాష్ట్రపతి నుంచి ఉత్తమ అవార్డులు, ఆరు సార్లు జాతీయ స్థాయిలో ఉత్తమ పురస్కారాలు అందుకున్నారు.

ప్రత్యేక స్కూల్, ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్స్

బుద్ధి మాంద్యత విద్యార్థులకు ప్రత్యేక విద్యతో పాటు ఆరేళ్లలోపు చిన్నారులకు, అభి వృద్ధి దశల్లో ఆలస్యమైన సుమారు 2,600 మందికి ఫిజియోథెరపీ, స్పీచ్‌థెరపీ సేవలు అందిస్తున్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో ప్రత్యేక స్కూల్లో ప్రత్యేక విద్యనందిస్తున్నారు. యానాంలో ప్రత్యేక స్కూల్, ఎర్లీ ఇంటర్‌వెన్షన్ సర్వీసెస్ సేవలు అందిస్తున్నారు. 2009 నుంచి తాళ్లరేవులో రిలయన్స్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో ధీరుబాయి అంబానీ ఎర్లీ ఇంటర్వెన్షన్, పునరావాస కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. అజీమ్ ప్రేమ్‌జీ ఆర్థిక సహకారంతో బధిర అంధత్వం, విశిష్ట వైకల్యం గల 420 మంది పిల్లలు, వ్యక్తులను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి సంస్థాగత, గృహ ఆధారిత, సమాజ ఆధారిత పునరావాసం కల్పించారు.

**సమాజ ఆధార పునరావాస కార్యక్రమం (సీబీఆర్):** దివ్యాంగుల ఇళ్లకు వెళ్లి పునరావాసం కల్పించే ఉద్దేశ్యంతో 1994లో ఈ కార్యక్రమాన్ని రంపచోడవరం మండలంలో ప్రారంభించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాల మేరకు ఇప్పటివరకు సుమారు 25వేల మందికి పైగా ఆరోగ్యం, విద్య, జీవనోపాధి ద్వారా లబ్ధి పొందారు.

### ప్రత్యేక విద్య కళాశాల

దివ్యాంగుల్లో మానవ వనరుల అభివృద్ధి కోసం రీహేబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గుర్తింపు పొందిన బ్యాచిలర్ ఇన్ ఎడ్యుకేషన్ స్పెషల్ ఎడ్యుకేషన్ (మెంటల్ రిటార్డేషన్, వినికిడి సమస్య) కోర్సులను 2021 నుంచి అక్కా యూనివర్సిటీ అనుబంధ సంస్థగా ప్రత్యేక విద్యా కళాశాల నిర్వహిస్తున్నారు.



మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు నుంచి జాతీయ పురస్కారం అందుకుంటున్న ఉమా మనో వికాస కేంద్రం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌పీ రెడ్డి

### జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం (డీడీఆర్‌సీ)

2011లో కేంద్ర ప్రభుత్వ సహకారంతో కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాలతో పాటు ఏలూరు జిల్లాలో డీడీఆర్‌సీ ఏర్పాటుచేసి సేవలు అందిస్తున్నారు వికలత్వంపై అవగాహన సదస్సులు, చట్టాలు, సంక్షేమ పథకాలు, కృత్రిమ పరికరాల అంచనా, పంపిణీ చేస్తున్నారు. నవజాత శిశువుల్లో వినికిడి సమస్యను గుర్తించేందుకు కాకినాడ జీజీహెచ్‌లో ప్రతి గురువారం అత్యాధునిక ఏవోఈ, బెరా యంత్రాల ద్వారా పరీక్షలు నిర్వహించి పునరావాసం కల్పిస్తున్నారు.



కృత్రిమ కాలు తయారు చేస్తున్న దృశ్యం

### కృత్రిమ అవయవాల తయారీ మొబైల్ వర్క్‌షాపు

కృత్రిమ అవయవాల తయారీ యూనిట్‌ని 1997లో ప్రారంభించారు. ట్రై సైకిల్స్ శ్రవణ యంత్రాలు, కృత్రిమ కాళ్లు వంటి సహాయ పరికరాలను ఏటా 700 నుంచి 900 వరకు పంపిణీ చేస్తున్నారు. 2015లో మొబైల్ వర్క్‌షాపుని రిలయన్స్ ఇండస్ట్రీస్ సహకారంతో వాకలపూడిలో ఏర్పాటుచేశారు. ఈ మొబైల్ యూనిట్ ప్రతి మండల కేంద్రానికీ వెళ్లి దివ్యాంగుల కృత్రిమ పరికరాలను రిపేర్ చేయడం, కొత్త వాటికి కొలతలు తీసుకోవడం చేస్తోంది.

# నన్నయకు ఐదు ఐఎస్‌వో సర్టిఫికెట్లు



నన్నయ వర్సిటీకి లభించిన ఐదు ఐఎస్‌వో సర్టిఫికెట్లు చూపుతున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమగ్రాభివృద్ధి, ఉన్నత విద్యలో శ్రేష్ఠతను, నాణ్యతను అందించడానికి కృషిచేస్తూ తగిన వనరులను అందిస్తున్న ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి ఐదు ఐఎస్‌వో సర్టిఫికెట్లు లభించాయని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. త్వరలో ఫైవ్‌స్టార్ రేటింగ్ సర్టిఫికెట్ దక్కుతుందని చెప్పారు. విశ్వవిద్యాలయంలో మంగళవారం ఐఎస్‌వో ఎగ్జిట్ సమావేశాన్ని ఐ.క్యూ ఏసీ డైరెక్టర్ వి.పెర్సిస్ సమన్వయం చేశారు. ఈ సందర్భంగా హిమ్ ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అధిపతి ఆలపాటి శివయ్య ఈ ఐదు సర్టిఫికెట్లను వీసీకి అందజేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఐఎస్‌వో 50001:2018 అవసరాలకు అనుగుణంగా ఎనర్జీ నిర్వహణ వ్యవస్థను అమలు చేసిన కారణంగా ఎనర్జీ మేనేజ్మెంట్ సిస్టమ్ సర్టిఫికేషన్, ఐఎస్‌వో 14001:2015 అవసరాలకు అనుగుణంగా పర్యావరణ నిర్వహణ వ్యవస్థను అమలు చేసిన కారణంగా ఎన్విరాన్మెంటల్ మేనేజ్మెంట్ సిస్టమ్ సర్టిఫికేషన్, ఐఎస్‌వో 9001:2015 చక్కని విద్య సేవలందిస్తున్నందుకు జెండర్ సెన్సిటైజేషన్ ఆడిట్ సర్టిఫికేషన్, అకడమిక్ అడ్మినిస్ట్రేటివ్ ఆడిట్ సర్టిఫికేషన్స్ లభించడం అభినందనీయమన్నారు.

**త్వరలో ఫైవ్‌స్టార్ రేటింగ్ సర్టిఫికెట్ : వీసీ ప్రసన్నశ్రీ**

ఎనర్జీ మేనేజ్మెంట్ సిస్టమ్ సర్టిఫికేషన్ పర్యావరణ ప్రభావాన్ని సమర్థవంతంగా నిర్వహించడానికి, వారి పర్యావరణ పనితీరు మెరుగుపరచడానికి సంస్థలకు సహాయ పడుతుందన్నారు. జెండర్ సెన్సిటైజేషన్ ఆడిట్ సర్టిఫికేషన్ సమస్యలను గుర్తించడం పరిష్కరించడం ద్వారా మహిళలకు సురక్షితమైన సమగ్ర వాతావరణం సృష్టించడానికి సంస్థలకు సహాయపడుతుందని తెలిపారు. చక్కని విద్యాసేవలను అందిస్తున్నందుకు, అకడమిక్ అడ్మినిస్ట్రేషన్ సమర్థవంతమైన నిర్వహణకు ఈసర్టిఫికెట్లు ప్రతీకగా ఉంటాయని చెప్పారు. హిమ్ ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అధిపతి ఆలపాటి శివయ్య మాట్లాడుతూ నన్నయ విశ్వవిద్యాలయంలో రెండురోజులు పాటు నిర్వహించిన ఆడిట్ ప్రక్రియకు సంతృప్తి చెందామని, దానికి నిదర్శనంగా ఫైవ్‌స్టార్ క్వాలిటీ రేటింగ్ సర్టిఫికెట్ అందిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో నన్నయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, ఫ్యాకల్టీ అసోసియేట్ ఎస్.మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో సమగ్ర క్యాన్సర్ చికిత్సకు కొత్త దిశ



**రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు**


కాకినాడ సిటీ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో సమగ్ర క్యాన్సర్ చికిత్స సేవలను విస్తరించేందుకు అవసరమైన కేంద్ర సహకారంపై మంగళవారం పార్లమెంట్ సమావేశంలో రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు ప్రశ్నించారు. ఆయన ప్రశ్నకు కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్ స్పందిస్తూ దేశవ్యాప్తంగా అమల్లో ఉన్న సమగ్ర క్యాన్సర్ కేర్ కార్యక్రమాలు, ఆంధ్రప్రదేశ్‌కు వాటి ద్వారా లభిస్తున్న ప్రయోజనాలను వివరించారు. ఆధునిక వైద్యం, ఆయుష్ చికిత్సలను కలిపి రోగులకు సమగ్ర సహాయం అందించే విధానాన్ని కేంద్రం బలంగా ప్రోత్సహిస్తోందన్నారు. ఇందు కోసం కొట్టక్కల్ ఆయుర్వేద వైద్యశాల, ముంబై లోని టాటా మెమోరియల్‌లో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసిందన్నారు. ఏఐఐఏ-ఏఐఐఎంఎస్ ఝజ్జర్, గోవా మెడికల్ కాలేజీలలో సంయుక్త పరిశోధన యూనిట్లు పని చేస్తున్నాయని వివరించారు. 2017-20 మధ్య కృష్ణా జిల్లాలో అమలు చేసిన సీసీఆర్‌హెచ్- డీజీహెచ్ఎస్ పైలట్ ప్రాజెక్టు హోమియోపతి, యోగా పద్ధతులను అనుసరించి క్యాన్సర్ రోగులకు సాయం అందించిందని, ఈ ప్రాజెక్టు ఏపీలో సమగ్ర చికిత్సకు మంచి పునాది వేసిందని కేంద్ర మంత్రి వెల్లడించారు. దీనిపై ఎంపీ సతీష్‌బాబు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు దిశానిర్దేశంతో ఆరోగ్య రంగంలో సమగ్ర వైద్య విధానాలపై తీసుకుంటున్న చర్యలకు అనుకూలంగా కేంద్రం ఇచ్చిన సమాధానం రాష్ట్రంలో సమగ్ర క్యాన్సర్ చికిత్సకు కొత్త దిశ కానుందన్నారు. రాష్ట్రంలో మరిన్ని జిల్లాలకు సమగ్ర క్యాన్సర్ చికిత్స సౌకర్యాలను విస్తరించేందుకు కృషి చేస్తానన్నారు. సమగ్ర వైద్యం రోగుల ఆరోగ్యానికే మాత్రమే కాకుండా, కుటుంబాలకు ధైర్యం ఇస్తుందన్నారు.రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంతో సమన్వయం కొనసాగిస్తానని ఎంపీ సతీష్‌బాబు వెల్లడించారు.

## చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

### బొమన్ సాబ్ లుక్

ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'రాజాసాబ్'. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. జనవరి 9న విడుదలవుతోంది. ఈ చిత్రంలో అతీంద్రియ శక్తుల పరిశోధకుడిగా బాలీవుడ్ నటుడు బొమన్ ఇరానీ కీలక పాత్ర పోషిస్తున్నారు. మంగళవారం ఆయన పుట్టిన రోజు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ చిత్రబృందం స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేసింది. హారర్ కామెడీ జానర్‌లో ఎవర్‌గ్రీన్ మూవీగా నిలిచిపోయేలా 'రాజా సాబ్'ను రూపొందిస్తున్నారు దర్శకుడు మారుతి. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ ఈ చిత్రంలో హీరోయిన్లుగా నటిస్తున్నారు.





### కథను మలుపుతిప్పే పాత్ర పోషించాను

**- సంయుక్త**

'అఖండ 2: తాండవం' చిత్రంలో అవకాశం వచ్చినప్పుడు నేను చాలా బిజీగా ఉన్నాను. ఒక మంచి సినిమాలో అవకాశం వస్తే తిరస్కరించకూడదు అని భావించి డేట్స్ అడ్జెస్ట్ చేసుకొని నటించాను. ఈ సినిమాలో కథను మలుపు తిప్పే పాత్ర పోషించాను' అని సంయుక్త అన్నారు. నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'అఖండ 2: తాండవం'. నందమూరి తేజస్విని సమర్పణలో రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మించారు. ఈ నెల 5న విడుదలవుతోంది. ఈ సందర్భంగా కథానాయిక సంయుక్త సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు.

- "అఖండ 2: తాండవం' చిత్రం 'అంచనాలకు మించి ఉండబోతోంది. బోయపాటి గారు గ్రేట్ విజన్‌తో తెరకెక్కించారు. విజువల్స్ అద్భుతంగా ఉంటాయి.
- ఈ చిత్రంలో నా పాత్ర చాలా కీలకంగా, స్టైలిష్‌గా ఉంటుంది. నా కెరీర్‌లో తొలిసారి ఓ మాస్ సాంగ్ చేశాను. ఇలాంటి మాస్ సాంగ్ ఇప్పటివరకూ చేయలేదు. చాలా కష్టపడ్డాను. ప్రాక్టీస్ చేసే సమయంలో మోకాలు దెబ్బతిని సహకరించకపోవడంతో ఫిజియోథెరపీ చేయించుకున్నా.
- బాలకృష్ణ గారు దర్శకుల నటుడు. వారు ఎలా చెబితే అలా చేస్తారు. నటుడిగానూ ఆయన విజన్ అద్భుతం. సెట్‌లో ఆయన చాలా స్నేహంగా ఉండేవారు. ఆయన నటించిన 'డాకూ మహరాజ్' నా ఫేవరేట్ చిత్రం.
- తమన్ సంగీతం, ముఖ్యంగా సంస్కృత శ్లోకాలతో సాగే నేపథ్య సంగీతం ప్రేక్షకులను అలరిస్తుంది. మా నిర్మాతలు రామ్, గోపీ గారు మేకింగ్‌లో రాజీ పడలేదు. సినిమాను ప్రేక్షకులకు చేరువ చేసేందుకు దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం కథానాయికగా స్వయంభు, నారీ నారీ నడుమ మురారి చిత్రాలు చేస్తున్నాను.

### అఖండ 2 టికెట్ ధరల పెంపు

**- ఏపీ ప్రభుత్వ అనుమతి**

నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా నటించిన 'అఖండ 2' సినిమా టికెట్ ధరల పెంపునకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మంగళవారం అనుమతిచ్చింది. ఈ నెల 5న ఈ చిత్రం విడుదలవుతోంది. నిర్మాతల వినతి మేరకు భారీ బడ్జెట్ సినిమాలకు ప్రభుత్వం ప్రత్యేక అనుమతి జారీ చేస్తోంది. అందులో భాగంగానే ఈ సినిమా విడుదలైన తొలి పది రోజులు టికెట్ ధరలు పెంచుకునేందుకు డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లకు పూర్తి అనుమతి లభించింది. సింగిల్ స్క్రీన్లలో సాధారణ రేటుపై రూ. 75, మల్టీప్లెక్స్‌ల్లో రూ. 100 పెంపునకు అనుమతించింది. ఈ నెల నాలుగున ప్రదర్శించే ప్రీమియర్ షో టికెట్ ధర రూ. 600గా నిర్ణయించారు.

### విందు భోజనంలా ఎంజాయ్ చేసే సినిమా



క్రికెట్ క్రీడ నేపథ్యంలో కామెడీ ప్రధానాంశంగా రూపుదిద్దుకున్న చిత్రం 'గేట్'. సుడిగాలి సుధీర్, దివ్యభారతి జంటగా నటించారు. ఎం. చంద్రశేఖర్ నిర్మించారు. మంగళవారం నిర్మాత దిల్‌రాజు టీజర్‌ను విడుదల చేసి, యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ 'అడ్డంకులను దాటుకొని ఈ సినిమాను అద్భుతంగా తీర్చిదిద్దాం. మంచి అభిరుచితో చేసిన సినిమా ఇది. ప్రేక్షకులు విందు భోజనంలా ఎంజాయ్ చేస్తారు. మణిశర్మ నేపథ్య సంగీతం సినీ ప్రియులను మెప్పిస్తుంది. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం' అని చెప్పారు. సహ నిర్మాత రవీందర్ రెడ్డి మాట్లాడుతూ 'ఈ సినిమాను మాస్ ఎంటర్‌టైనర్‌గా తీశాం. చంద్రశేఖర్ రెడ్డి ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డారు' అని తెలిపారు. ఆద్యంతం వినోదం పంచే చిత్రమిదని దివ్యభారతి తెలిపారు.

### యువతకు కనెక్ట్ అయ్యే కథ



రివేంజ్ స్టోరీతో సాగే థ్రిల్లింగ్ ప్రేమకథా చిత్రం 'సైక్ సిద్ధార్థ్'. శ్రీనందు, యామిని భాస్కర్ జంటగా నటించారు. వరుణ్‌రెడ్డి దర్శకత్వంలో శ్రీనందు, శ్యామ్ సుందర్‌రెడ్డి నిర్మించారు. ఈ నెల 12న విడుదలవుతోంది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా శ్రీనందు మాట్లాడుతూ 'ఇప్పుడున్న సమాజానికి, యువతకు కనెక్ట్ అయ్యే కథతో తెరకెక్కిన చిత్రమిది. సురేశ్‌బాబు గారు సినిమా చూసిన వెంటనే పంపిణీ చేసేందుకు అంగీకరించారు. సురేశ్ ప్రొడక్షన్స్ ఈ సినిమాను తీసుకోవడంతో నా కల నెరవేరినట్లయింది' అని చెప్పారు. వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ 'ప్రచార చిత్రాలకు చక్కని ప్రేక్షకాదరణ దక్కింది. అన్ని వర్గాల ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేసే చిత్రమిది. తెలుగు ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టుగా స్క్రీన్‌ప్లేలో చాలా మార్పులు చేశాం' అని చెప్పారు.

### అనుమాన పక్షి వచ్చేది అప్పుడే



రాగ్ మయూర్, మెరిన్ ఫిలిప్ జంటగా 'డీజే టిల్లు' ఫేమ్ విమల్ కృష్ణ తెరకెక్కిస్తున్న చిత్రం 'అనుమాన పక్షి'. చిలక ప్రొడక్షన్స్‌పై రాజీవ్ చిలక, రాజేశ్ జగ్గియాని, హీరాచంద్ దండ్ నిర్మిస్తున్నారు. తాజాగా సినిమా విడుదల తేదీని వెల్లడిస్తూ ఓ వీడియోను షేర్ చేశారు మేకర్స్. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుందని తెలిపారు. వినోద ప్రధానంగా సాగే ఈ సినిమా విమల్ కృష్ణ మార్క్‌తో స్టైలిష్‌గా ఉండనుందని చెప్పారు. రాగ్ మయూర్ పాత్ర చాలా విభిన్నంగా ఉంటుందని పేర్కొన్నారు. అతిగా ఆలోచిస్తూ, అతి జాగ్రత్తతో ఉండే ఆయన రోల్ ప్రేక్షకులను ఆకట్టుకోవడమే కాక, కడుపుబ్బా నవ్విస్తుందని మేకర్స్ అన్నారు. బ్రహ్మాజీ, ప్రిన్స్ సెసిల్, అనన్య, చరిత్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి డీఓపీ: సునీల్‌కుమార్ నామా, సంగీతం: శ్రీచరణ్ పాకాల.

### ప్రేమ కోసం యుద్ధం



రోషన్ కనకాల, సాక్షి మడోల్కర్ జంటగా 'కలర్ ఫొటో' ఫేమ్ సందీప్ రాజ్ తెరకెక్కించిన చిత్రం 'మోగ్లీ 2025'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతిప్రసాద్ నిర్మించారు. ఈ నెల 12న సినిమా విడుదలవుతోంది. మంగళవారం చిత్రం ట్రైలర్‌ను హీరోయిన్ రష్మిక మందన్న విడుదల చేసి, చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ట్రైలర్‌లో పాత్రలను, కథా నేపథ్యాన్ని పరిచయం చేసిన విధానం ఆకట్టుకుంది. 'తన ప్రేమ కోసం యుద్ధం చేసే ప్రతీవాడు హీరోనే' అంటూ కథానాయకుడు పలికిన సంభాషణలు ఆకట్టుకున్నాయి. బండి సరోజ్‌కుమార్ ఈ సినిమాలో విలన్‌గా నటించారు. హర్ష చెముడు కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రానికి ఎడిటర్: కోదాటి పవన్‌కల్యాణ్, డీఓపీ: రామ మారుతి ఎమ్, సంగీతం: కాలభైరవ.

### కాంతారపై కామెడీ



**రణ్‌వీర్ క్షమాపణలు**

కాంతార చిత్రంపై తాను చేసిన వ్యాఖ్యలకు బాలీవుడ్ హీరో రణ్‌వీర్ సింగ్ మంగళవారం క్షమాపణలు చెప్పారు. ఎవరినీ కించపరచడం తన ఉద్దేశం కాదని తెలిపారు. 'రిషబ్ శెట్టి బాగా నటించారని చెప్పడం కోసమే నేను అలా నటించాను. అలాంటి సన్నివేశాల్లో నటించాలంటే చాలా కష్టం. అయినా ఏ ఇబ్బంది లేకుండా అటువంటి సన్నివేశాలను ఎంతో ఈజ్‌తో చేసే ఆయనంటే నాకు చాలా ఇష్టం. మన దేశంలోని ప్రతీ సంప్రదాయం మీద నాకు అపారమైన గౌరవం ఉంది. నా వ్యాఖ్యలు ఎవరినైనా బాధపెట్టి ఉంటే క్షమించండి' అని పేర్కొన్నారు. 'కాంతార'పై రణ్‌వీర్ చేసిన వ్యాఖ్యలపై హిందూ జనజాగృతి సమితి ఫిర్యాదు చేసింది. ఆయన చేసిన కామెంట్స్ హిందువుల విశ్వాసాన్ని దెబ్బతీశాయని పేర్కొంది. గోవాలో ఇటీవలె ముగిసిన ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఇఫీ) వేడుకల్లో రణ్‌వీర్ 'కాంతార' చిత్రంపై చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. వేదికపై మాట్లాడుతూ "కాంతార' సినిమాలో రిషబ్ శెట్టి నటన అద్భుతం. హీరో పాత్రలోకి దెయ్యం ప్రవేశించినప్పుడు వచ్చే సన్నివేశాలు చాలా బాగున్నాయి" అని రణ్‌వీర్ పేర్కొన్నారు. ఆ సినిమాలో ఎంతో పాపులర్‌గా మారిన 'ఓ' అనే శబ్దాన్ని స్టేజీపై అనుకరించారు. దేవతను ఆయన దెయ్యంగా పోల్చాడని కర్ణాటక వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షమాపణలు చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు.

### వినూత్నంగా వన్ బై ఫోర్



నూతన నటీనటులతో సరికొత్త తరహాలో తెరకెక్కిన కామెడీ థ్రిల్లర్ 'వన్ బై ఫోర్'. వెంకటేశ్ పెద్దపాలెం, అపర్ణ మల్లిక్ జంటగా నటించారు. బాహుబలి పళని కె. దర్శకత్వంలో రంజన రాజేశ్ గుంజల్, రోహిత్ రాందాస్ గుంజల్ సంయుక్తంగా నిర్మించారు. ఈ నెల 12న విడుదలవుతోంది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా వెంకటేశ్ పెద్దపాలెం మాట్లాడుతూ 'కొత్త తరహా కథాంశంతో ఈ క్రైమ్ డ్రామాను తీశాం. పళని గారి టేకింగ్ సినిమాకు ప్రత్యేకాకర్షణ. 'హారర్, సస్పెన్స్ అంశాలు, పోరాట ఘట్టాలు చాలా బావుంటాయి' అని చెప్పారు. దర్శకుడు మాట్లాడుతూ 'క్రైమ్ అంశాలతో పాటు మానవ సంబంధాలను చర్చిస్తూ సందేశాత్మకంగా సాగే చిత్రమిది. పతాక ఘట్టాలే సినిమాకు హైలెట్' అని చెప్పారు. కథ మీద నమ్మకంతో ఈ చిత్రాన్ని నిర్మించాం, ప్రేక్షకులు ఆశించే అంశాలతో ఆసక్తికరంగా సాగుతుంది అని నిర్మాతలు తెలిపారు.

### విడుదలకు సిద్ధం



భాస్కర్, కోటేశ్వర రావు ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన చిత్రం 'విధాత'. మణికంఠ రాజేంద్రబాబు దర్శకత్వంలో అప్పిని పల్లె భాస్కర చారి నిర్మించారు. విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా మణికంఠ రాజేంద్రబాబు మాట్లాడుతూ 'ఇదో వైవిధ్యభరితమైన చిత్రం. పాత్రలన్నీ సహజ సిద్ధంగా ఉంటాయి' అని అన్నారు. 'ఓ యదార్థ సంఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించాము' అని అప్పిని పల్లె భాస్కర చారి తెలిపారు.


అన్నవరం ఆలయ ప్రాంగణంలో సైన్‌బోర్డులు ఏర్పాటు చేస్తున్న అధికారులు

# భక్తులకు విజ్ఞప్తి...

- అన్నవరం దేవస్థానంలో సేవలు, వ్రతాల టిక్కెట్ల ఆన్‌లైన్ విధానంపై విస్తృత ప్రచారం
- ముఖ్య ప్రదేశాల్లో సైన్‌బోర్డులు
- ప్రజలకు తగ్గనున్న నిరీక్షణ

అన్నవరం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాలు, దేవదాయశాఖ సూచనలతో కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో నూతనంగా ఏర్పాటుచేసిన ఆన్‌లైన్ బుకింగ్, దర్శనాలు, వసతి, ప్రసాదం ప్యాకెట్ల కొనుగోలు తదితర అంశాలపై విస్తృత ప్రచారం చేపట్టారు. దేవదాయశాఖలో కేవలం 2శాతం మంది మా త్రమే ఆన్‌లైన్ సేవలను వినియోగించుకుంటున్నారని సర్వేలో తేలడంతో అధికశాతం భక్తుల దర్శనాలు, ప్రసాదాల కొనుగోలు వద్ద, వసతి కేటాయింపు సమయంలో అధికసమయం నిరీక్షణ చేస్తుండడంతో అంతా ఆన్‌లైన్ విధానం తీసుకువచ్చారు. దీనిని విస్తృతంగా భక్తుల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యతను ఆయా దేవస్థానాలకు అప్పగించింది. దీంతో అన్నవరం ఆ లయ ప్రాంగణంలో ముఖ్యప్రదేశాలు, ఇతర ప్రాంతాలతో సైన్‌బోర్డులు ఏర్పాటు చేయడం తో పాటుగా ఉద్యోగులు తమ ఫోన్లలో స్టేటస్‌లలో పెడుతున్నారు. భక్తులు ఆన్‌లైన్ విధానం సద్వినియోగం చేసుకుంటే నిరీక్షణ సమయం చాలా తగ్గుతుందని అధికారులు తెలిపారు.

### అంతర్వేదిలో కూడా..

అంతర్వేది, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దేవదాయశాఖ ఆదేశాల మేరకు కమిషనర్ సూచనలు అనుసరించి డాక్టర్ బీఆర్ అంబే డ్కర్ కోనసీమ జిల్లా అంతర్వేది శ్రీలక్ష్మీనసింహస్వామి ఆలయంలో దేవస్థానానికి సంబంధించి వసతి గదులు, దర్శనాలు, అభిషేకం, సుదర్శన హోమం, ఇతర సేవల బుకింగ్‌లు, ప్రసాదం టోకెన్ల విక్రయాలు ఆన్‌లైన్ ద్వారా అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆన్‌లైన్ ద్వారా వివిధ సేవలు, దర్శనాల టిక్కెట్లను బుక్ చేసుకునే విధానంలో వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. ఏపీటెంపుల్స్ ఏపీ. జీవోవీ.ఇన్ ద్వారా ఆలయంలో జరిగే సేవలను ముందస్తు బుకింగ్ చేసుకోవచ్చని ఆలయ ఏసీ ఎంకేటీఎన్వీ ప్రసాద్ తెలిపారు. అన్నదాన, గో సంరక్షణ వంటి పథకానికి విరాళాలు, క్రెడిట్, డెబిట్ కార్డులు, గూగుల్‌పే, ఫోన్‌పే, పేటీఎం, భీమ్ యూపీఐ ద్వారా చెల్లించవచ్చని చెప్పారు.

# శివాలయంలో నాగుపాము ప్రత్యక్షం

### చూసేందుకు తరలివచ్చిన ప్రజలు



పగడ విప్పి ఉన్న నాగుపాము, చూస్తున్న ప్రజలు

రౌతులపూడి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా రౌతులపూడిలోని పురాతన శివాలయంలో మంగళవారం నాగుపాము ప్రత్యక్షమైంది. శివలింగం దగ్గరకు వెళ్లేందుకు ప్రయత్నించింది. తలుపులు వేసి ఉండడంతో వెనుదిరిగి నందీశ్వరుడి వద్ద సుమారు 3 గంటలసేపు ఉం డిపోయింది. విషయం తెలిసి గ్రామస్తులు నాగుపామును చూసేందుకు తరలివచ్చారు. వారు చూస్తుండగానే గుడి వెనుక నుంచి వెళ్లిపోయింది.

# సాగుకు సంరక్షణ ఏది?

### జీడిమామిడిని సంరక్షించుకోలేని దుస్థితిలో గిరిజనం

### యంత్రాలూ, స్ప్రేయర్లు, ఉపకరణాలు కొనుగోలు చేయడానికి ఇబ్బందులు



(రంపచోడవరం/ఆంధ్రజ్యోతి)
రంప మన్యంలోని గిరిజనం తమ సాంప్రదాయ జీడిమామిడి సాగును సంరక్షించుకోలేని దుస్థితిలో ఉన్నారు. మన్యం 12 మండలాల్లో సుమారు 50 వేలకుపైగా ఎకరాల్లో జీడిమామిడి సాగును గిరిజనులు కొనసాగిస్తున్నారు. అయి తే జీడిమామిడికి పట్టే తెగుళ్లను నివారించుకోవడంలో సాయం అందక, తమ ఆర్థిక పరిస్థితులు సరిగా లేక ఇక్కడ జీడిమామిడి రైతాంగం నిర్దిష్టమైన ఆదాయాన్ని పొందలేకపోతున్నారు. దీంతో ఈ జీడిమామిడి తోటలను సొంత ఖర్చులతో నిర్వహించుకునే స్థోమత లేక ఇతరులకు తోటలను లీజులకు ఇచ్చేసి ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాల కోసం వెతుకులాడుతున్నారు. మరికొందరైతే జీడిమామిడి పిక్కల కొనుగోలుదార్ల నుంచి అడ్వాన్సులు తీసుకుని పంటను సంరక్షించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆనక పంట చేతికి వచ్చాక కొనగోలు దారులు ఇచ్చిన అడ్వాన్సుకు వడ్డీతో కలిపితే రైతుల చేతులకు వచ్చేది శూన్యంగా ఉంటోంది.

**తెగుళ్ల బెడద...**
ప్రస్తుతం మన్యంలో జీడిమామిడి తోటలన్నీ పువ్వులుతొడిగి పరిపక్వానికి సిద్ధమవుతున్నాయి. శీతాకాలం కావడంతో తేనె మంచు తెగులు, ఇతర తెగుళ్లు పడుతుండగా మరోపక్క కోతుల బెడద కూడా రైతాంగాన్ని ఇబ్బందులకు గురి చేస్తోంది. తెగుళ్లకు మందులను, వాటిని పిచికారీ చేసుకోవడానికి యంత్రాలూ, స్ప్రేయర్లు, ఇతర ఉపకరణాలను కొనుగోలు చేసుకోలేక దిక్కుతోచని స్థితిలో గిరిజనులు నలిగిపోతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లపాటు ఇదే దుస్థితిని ఎదు ర్కొన్నారు. కూటి ప్రభుత్వం పాలనలో ఏడాదిన్నర గడిచినా అధికారుల తీరులో మార్పు లేదు. ప్రభుత్వం రైతాంగానికి అన్ని విధాలా సహకరించాలని స్పష్టం చేస్తున్నా క్షేత్ర స్థాయిలో పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. వీరికి అవసరమైన సాయాన్ని అందించే సానుకూల పరిస్థితులు లేక, జీడిమామిడి తోటలకు పడుతున్న తెగుళ్లను కూడా నివారించలేకపోతున్నారు. ఇక్కడి పరిస్థితులను ప్రభుత్వం గుర్తించి తమను ఆదుకుని జీడిమామిడి తోటలను కాపాడాలని గిరిజనులు కోరుతున్నారు.

# వైద్యం అందలేదు.. ప్రాణం ఆగలేదు!

- హోటల్ కార్మికుడికి గుండె నొప్పి
- చేబ్రోలు పీహెచ్‌సీకి తాళాలు
- 108 వచ్చేసరికే మృతి


మరణించిన మాణిక్యం


తాళాలు వేసి ఉన్న చేబ్రోలు పీహెచ్‌సీ

గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): 24గంటలు వైద్య సేవలు అందించాల్సిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తాళాలు వేసి ఉండడంతో సకాలంలో వైద్యం అందక వ్యక్తి మరణించిన సంఘటన కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో మంగళవారం జరిగింది. దీంతో పీహెచ్‌సీ వైద్యుడిని సస్పెండ్ చేయగా, స్టాఫ్‌నర్సుకు షోకాజ్ నోటీసు జారీ చేశారు.

చేబ్రోలు గ్రామంలోని ఓ హోటల్‌లో పనిచేస్తున్న శరభవరం గ్రామానికి చెందిన ఇమ్మంది మాణిక్యం(56) తెల్లవారుజామున 2గంటల సమయంలో గుండెల్లో నొప్పిగా ఉందని చెప్పడంతో చేబ్రోలు పీహెచ్‌సీకి తీసుకువెళ్లారు. అయితే పీహెచ్‌సీకి తాళాలు వేసి ఉండడంతో సిబ్బంది ఎవ్వరు లేరు. దీంతో 108 అంబులెన్స్ కోసం ఫోన్ చేయగా గంట తర్వాత వచ్చింది. 108 సిబ్బంది వచ్చి పరీక్షించగా అప్పటికే చనిపోయినట్లు తెలిపారు. 24గంటలు పనిచేయాల్సిన పీహెచ్‌సీ మూసి ఉండడంతోనే వైద్యం అందక మాణిక్యం మరణించినట్లు స్థానికులు తెలిపారు. ఇక్కడ పని చేసే సిబ్బందిలో నలుగురిని ఇతర ప్రాంతాలకు డిప్యూటేషన్ వేయడంతో పాటు వైద్యుల్లో ఒకరు సెలవులో ఉండడంతో పీహెచ్‌సీలో ఎవ రు అందుబాటులో లేని పరిస్థితి ఏర్పడినట్లు వా రు చెప్పారు. ఈ విషయంపై పలుమార్లు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతోనే ఒకరు మరణించినట్లు జడ్పీటీసీ ఉలవ కాయల నాగలోవరాజు, టీడీపీ నాయకుడు బత్తుల శ్రీను ఆరోపించారు. మరోవైపు టీడీపీ, జనసేన నాయకులు పీహెచ్‌సీని పరిశీలించారు.

**డీఎంహెచ్‌వో విచారణ**
వైద్యం అందక వ్యక్తి మరణించిన సంఘటనపై జిల్లా కలెక్టర్ సగిలి షాన్‌మోహన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కార్యాలయ అధికారులు ఆరా తీశారు. కలెక్టర్ ఆదేశాలతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి నరసింహనాయక్ చేబ్రోలు చేరుకుని విచారణ చేపట్టారు. ఆరునెలల నుంచి సిబ్బంది కొరతపై ఫిర్యాదు చేసినా ఎందుకు స్పందించలేదని గ్రామస్తులు ప్రశ్నించారు. పీహెచ్‌సీకి తాళాలు వేసి ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

### వైద్యాధికారి సస్పెన్షన్

పీహెచ్‌సీకి తాళాలు వేసి ఉండడం, వైద్యం అందక వ్యక్తి మరణించిన సంఘటనలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాయిరతన్‌ను డ్యూటీ రోస్టర్ వేయడం, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినందులకు గానూ సస్పెండ్ చేసినట్టు డీఎంహెచ్‌వో మంగళవారం రాత్రి తెలిపారు. అదేవిధంగా స్టాఫ్‌నర్సుకు షోకాజ్ నోటీసు జారీ చేశామని తెలిపారు. ఇద్దరు వైద్యులకు గానూ ఒక వైద్యుడు డాక్టర్ వి.నిఖిల్ సెలవులో ఉన్నట్లు చెప్పారు. డిప్యూటేషన్‌పై ఉన్న స్టాఫ్‌నర్సును తక్షణం చేబ్రోలులో రిపోర్టు చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. పీహెచ్‌సీలో వైద్యసేవలు అందించేందుకు తాళ్లరేవు నుంచి డాక్టర్ ఎల్ సురేష్‌కుమార్ చేబ్రోలుకు డిప్యూటేషన్‌పై నియమించినట్లు చెప్పారు. కాగా సిబ్బంది కొరత, డిప్యూటేషన్లపై ఫిర్యాదు చేసినా ఆరునెలలుగా స్పందించని జిల్లా అధికారులు ఇప్పుడు సంఘటన వెలుగులోకి రాగానే చర్యలు తీసుకోవడంపై గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.


పీహెచ్‌సీలో విచారణ జరుపుతున్న డీఎంహెచ్‌వో నరసింహనాయక్

## బంతి తోట తొలగింపు


బంతి తోట తొలగిస్తున్న దృశ్యం

ఆలమూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ముహూర్తాలు వెళ్లిపోయి మూఢం రావడంతో పూల రైతులు ఢీలా పడ్డారు. బంతిపూల రేటు కిలో రూ.15కి పడిపోయింది. దీంతో బంతి తోట కొనసాగిస్తే మరింత నష్టాలు వస్తాయనే ఉద్దేశంతో తొలగించి చామంతి వేయడానికి సిద్ధమవుతున్నారు. డాక్టర్ బీఆర్ అంబే డ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం బడుగు వానిలంక గ్రామానికి చెందిన బండారు నారాయణ ఇదే చేశాడు. ట్రాక్టర్‌తో తన బంతి పంటను తొలగించాడు. ఆ దృశ్యమే ఇది.

# కాంగ్రెస్‌కు కొండేటి చిట్టిబాబు రాజీనామా


చిట్టిబాబు

పి.గన్నవరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజవకర్గ మాజీ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్ష పదవికి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామ చేసినట్లు సోమవారం ప్రకటించారు. ఈ మేరకు వివరాలను ఫోన్‌లో విలేకర్లకు వెల్లడించారు. గతనెల 30న తన రాజీనామాను ఏపీసీసీ అధ్య క్షురాలు షర్మిలారెడ్డికి పంపించానని తెలిపారు. ఇప్పటివరకు పార్టీలో సేవలందించేందుకు సహకరించిన కాంగ్రెస్ పెద్దలు, ఏపీసీసీ అధ్యక్షురాలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలపుతున్నట్టు లేఖలో పేర్కొన్నారు. అలాగే కోనసీమ జిల్లాలో 7 నియోజకర్గాల ఇంచార్జ్‌లు, నాయకులు, కార్యకర్త లకు ధన్యవాదాలు తెలిపారు. ఆయన ఏ పార్టీలో చేరబోతున్నానో త్వరలో ప్రకటిస్తానని స్పష్టం చేశారు. చిట్టిబాబు కాంగ్రెస్‌పార్టీతో తన రాజకీయ ప్రస్థానం ప్రారంభించి అనంతరం వైసీపీ ఆవిర్భావం నుంచి వైసీపీలో ఉంటూ 2019-24 వరకు ఎమ్మెల్యేగా పనిచేశారు. 2024లో వైసీసీ నుంచి సీటు దక్కకపోవడంతో కాంగ్రెస్ పార్టీలో చేరి ఆ పార్టీ నుంచే ఎమ్మెల్యేగా బరిలో నిలబడ్డారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీకి కూడా రాజీనామా చేశారు. అయితే ఆయన కూటమి ప్రభుత్వం వైపు చూస్తున్నారని, త్వరలో టీడీపీ అధినాయకుడు సమక్షంలో ఆ పార్టీలో చేరబోతున్నట్టు జోరుగా ప్రచారం సాగుతుంది.

### విద్యార్థుల పట్ల కులవివక్షత...

# ముగ్గురు ఉపాధ్యాయులపై బదిలీవేటు

కొత్తపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల పట్ల కులవివక్షత చూపుతున్నారనే కారణాలతో ముగ్గురు ఉపాధ్యాయులపై విద్యాశాఖాధికారులు బదిలీవేటు వేశారు. కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం యండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు విద్యార్థుల పట్ల కులవివక్షత చూపుతున్నారని తల్లిదండ్రులు ఆందోళన చేపట్టడం విధితమే. ఈ నేపథ్యంలో యండపల్లి ఉన్నత పాఠశాలలో మంగళవారం విచారణ నిర్వహించి ముగ్గురు ఉపాధ్యాయులను బదిలీ చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. పాఠశాలలో ప్రశాంత వాతావరణం నెలకొల్పడానికి హెచ్‌ఎమ్ జి.సురేష్ భూషణంను శంఖవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు, ఆంగ్ల ఉపాధ్యాయుడు బి.శ్రీనుబాబును కరప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయుడు బి.ప్రసాదరావును రౌతులపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బదిలీ చేసినట్టు ఎంఈవోలు వేణుగోపాల్, పైడిరాజు తెలియజేశారు.

## విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి

కాజులూరు (కరప), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాజులూరు మండలం దుగ్గుదుర్రు గ్రామానికి చెందిన కౌలు రైతు కొప్పిశెట్టి అన్నవరం (67) విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. గొల్లపాలెం పోలీసుల సమాచారం మేరకు.. దుగ్గుదుర్రులో మూడున్నర ఎకరాల పొలాన్ని అన్నవరం గత కొన్నేళ్లగా కౌలుకు సాగుచేస్తున్నాడు. ఆదివారం పొలానికి వెళ్లిన అన్నవరం ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కంగారుపడిన కుటుంబసభ్యులు ఆచూకీ కోసం గాలించారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం సాగుచేస్తున్న పొలానికి సమీపంలోని ఒక ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తుప్పల్లో అతడి మృతదేహాన్ని గుర్తించారు. అన్నవరం ఒంటికి విద్యుత్ వైర్లు చుట్టుకుని ఉండడంతో విద్యుద్ఘాతం వల్లే మృతిచెందినట్టు భావిస్తున్నారు. సమాచారం అందుకున్న గొల్లపాలెం ఎస్ఐ ఎం.మోహన్‌కుమార్, ట్రాన్స్‌కో, రెవెన్యూ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టానికి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## పంటకాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కిర్లంపూడి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం వేలంక గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్ పక్కనే పంట కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి వేలంక వీఆర్వోకు తెలిపారు. ఆయన కిర్లంపూడి పోలీసులకు సమాచారం అందించారు. కిర్లంపూడి హెడ్ కానిస్టేబుల్ ఎవి.మూర్తి, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పంటకాలువలో ఉన్న మృతదేహాన్ని వెలికితీశారు. మృతదేహం కుళ్లిపోయి గుర్తుపట్టలేనివిధంగా చేరుకుంది. మృతుడి వయసు సమారు 45ఏళ్ల ఉంటుంది.. మృతదేహంపై బ్లూ టీ షర్టు, షార్ట్ ఉన్నాయి. ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించామని, స మాచారం తెలిసిన వారు జగ్గంపేట సీఐ నెంబర్ 9440796529, కిర్లంపూడి ఎస్ఐ సతీష్ 9440904834 నెంబర్‌లకు సమాచారం అందించాలని పోలీసులు పేర్కొన్నారు.

## తల్లీకుమార్తెల అదృశ్యంపై కేసు

ద్రాక్షారామ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామ నున్నవారి వీధికి చెందిన పలివెలి సావిత్రి (30), తన చిన్నకుమార్తె పూర్ణసాయిక్షిత(7)తో కలసి అదృశ్యమైనట్టు భర్త పలివెల జ్యోతిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ద్రాక్షారామ ఏఎస్ఐ వెంకటరమణ కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జ్యోతిబాబు సోమవారం రాత్రి 8గంటల ప్రాంతంలో ఇంటికి కిరాణా సరుకులు తీసుకెళ్లగా సావిత్రి మరికొన్ని సామన్లు తేవాలని కోరింది. జ్యోతిబాబు ఒకేసారి తీసుకురమ్మని చెప్పవచ్చుగా అని కేకలు వేసి బయటకు వెళ్లిపోయాడు. తిరిగి వచ్చేసరికి సావిత్రి, చిన్న కుమార్తె కనిపించలేదు. చుట్టుపక్కల వారిని అడుగగా చిన్న కుమార్తెను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయిందని చెప్పారు. దీంతో జ్యోతిబాబు అత్తగారికి ఫోన్ చేయగా తమ ఇంటికి రాలేదని చెప్పారు. బంధువుల ఇంట్లో గాలించగా ఆచూకీ లభించలేదు. దీంతో ద్రాక్షారామ పోలీసులకు జ్యోతిబాబు ఫిర్యాదు చేశాడు. ఏఎస్ఐ వెంకటరమణ కేసు నమోదు చేశారు.

## విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి

రంగంపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం రామేశంపేటలో జరిగింది. ఎస్ఐ ఎస్.శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. రామేశంపేటకు చెందిన పిల్లల తాతబ్బాయి (51) తన ఇంటిపై రెండోఫ్లోర్ నిర్మిస్తున్నాడు. ఆ పనులు ఎంతవరకు వచ్చాయో చూద్దామని మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు ఇంటిపైకి వెళ్లి పిట్టగోడ దగ్గర నుంచి పరిశీలిస్తుండగా పిట్టగోడ పక్క నుంచి వెళ్తున్న కరెంట్‌తీగ తగిలి షాక్‌తో అక్కడికక్కడే మరణించాడు. అతడి కుమారుడు కిషోర్ ఇచ్చినఫిర్యాదుతో ఎస్ఐ కేసు నమోదు చేశారు.

## గుర్తుతెలియని వృద్ధుడి మృతి

ద్రాక్షారామ, డిసెంబరు (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామ భీమేశ్వర థియేటర్ కాంప్లెక్సు ఎదురుగా అరుగుపై మంగళవారం ఉదయం సుమారు 70 ఏళ్ల వ్యక్తి మృతిచెందాడు. అతడు గత 20 ఏళ్లుగా చిత్తుకాగితాలు ఏరుకుంటూ, భిక్షమెత్తుకు జీవిస్తున్నాడని స్థానికులు చెప్తున్నారు. వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు పంచాయతీ సహకారంతో శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

# అన్నివర్గాలకు ఎస్సీ వర్గీకరణ ఫలాలు

### మాదిగ అనుబంధ కులాలకు కేంద్రం,రాష్ట్ర ప్రభుత్వాల సేవలు చిరస్మరణీయం

### ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



నడిపూడిలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

అమలాపురం రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ ఫలాలను అన్నివర్గాల వారు అనుభవించాలని రాజ్యాంగపరంగా నిర్దిష్టంగా ఉందని అందుకే అత్యున్నత న్యాయస్థానం సైతం మాదిగ అనుబంధ కులాలకు న్యాయం చేసేలా తీర్పు ఇచ్చిందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ ఫలాలను ప్రతీ ఒక్కరు అనుభవిస్తూ ఇతర వర్గాలవారితో పోటీపడుతూ అవసరమైతే జనరల్ కేటగిరిలో సైతం ఆధిక్యతను సాధించి గొప్పవారిగా నిలవడమే రాజ్యాంగ లక్ష్యమని పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో మంగళవారం జరిగిన ఓ వివాహ కార్యక్రమానికి హాజరైన ఆయన భారీ ర్యాలీగా పురవీధుల మీదుగా నడిపూడిలోని డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్ కల్యాణ మండపానికి చేరుకున్నారు. అనంతరం ఉమ్మడి జిల్లాస్థాయి మాదిగ అనుబంధసంఘాల సమావేశంలో మాట్లాడారు. రాజ్యాంగ బద్ధమైన హక్కులను జాతీయస్థాయిలో పొందడానికి దశాబ్దాలు పట్టాయని వివరించారు. వర్గీకరణ ఫలితాలు పొందుతూనే చదువుల్లో ప్రతీ మాదిగ బిడ్డ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కోనసీమ జిల్లా ఇన్‌చార్జి స్మామాట్ కేబీ మధుమాదిగ అధ్యక్షతన ఉమ్మడి జిల్లాల ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ అనుబంధ సంఘాల సమావేశం మంగళవారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగ అనుబంధ కులాలకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలోని చంద్రబాబు కూటమి ప్రభుత్వం చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో అనుకూలంగా ఎవరు ఉన్నారు, వ్యతిరేకంగా ఎవరు వ్యవహరిస్తున్నారు గుర్తించాలని సూచించారు. తొలుత ముక్కామల సెంటర్‌లో ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు తొత్తరమూడి గోవిందు మందకృష్ణకు భారీ గజమాలతో స్వాగతం పలికారు. సమావేశంలో ఎమ్మెస్పీ జాతీయ నాయకుడు మున్నంగి నాగరాజు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్, జాతీయ నాయకులు డాక్టర్ దూళ్లపల్లి సుబ్బారావు మాదిగ, పేరెల్లి ఎలీషా మాదిగ, జిల్లా ఇన్‌చార్జి పి.మధు, ఇన్‌చార్జి డాన్ సూరిమాదిగ, జాతీయ నాయకులు ముమ్మిడివరపు చినసుబ్బారావు, ఉందుర్తి వెంకట్రావు, రాజమహేంద్రవరం, కాకినాడ, కోనసీమ ఇన్‌చార్జిల తో పాటు నాయకులు ఆకుమర్తి రమేష్, డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు మోకాటి నాగేశ్వరరావు, డైరెక్టర్లు తొత్తరమూడి ప్రభాకరరావు, చాట్ల సత్యనారాయణ, కాప నాగభూషణం, మండ వెంకటేశ్వరరావు, కొడమంచిలి సాయికుమార్, ఈతకోట రాజు పాల్గొన్నారు.

### వాటర్ కండక్టర్ సిస్టం పనులకు

# నీటి విడుదల నిలిపివేశాం

### సీలేరు కాంప్లెక్సు చీఫ్ ఇంజనీర్ కేవీ రాజారావు


పూజలు చేసి కొబ్బరికాయ కొడుతున్న సీఈ రాజారావు

మోతుగూడెం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సీలేరు కాంప్లెక్సు పరిధిలోని పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న 5,6 యూనిట్లకు పెన్‌స్టాక్ నుంచి పైప్‌లైన్ ద్వారా నీరు పంపించే క్రమంలో వాటర్ కండక్టర్ సిస్టం పనులను ప్రారంభించడానికి మంగళవారం ఉదయం నుంచి డొంకరాయి నుంచి కెలాల్ నీటి విడుదలను నిలిపివేశామని సీలేరు కాంప్లెక్సు చీఫ్ ఇంజనీర్ కేవీ రాజారావు పేర్కొన్నారు. ఫోర్‌బై ఇంటెక్ డ్యాం వద్ద జాన్ అండర్ వాటర్ డైవింగ్ బృందంతో గేట్లను దించి పొల్లూరు జలవిద్యుత్ కేంద్రానికి నీరు వెళ్లకుండా చర్యలు చేపట్టామన్నారు. ఇంటెక్ డ్యాం దిగువన ఉన్న 5.5 కిలోమీర్ల పొడవున గల టన్నెల్ గేట్లను కూడా అండర్ వాటర్ డైవింగ్ బృందం దించిన తరువాత లీకేజీలు లేకుండా సీల్ వేస్తారని, అనంతం టన్నెల వద్ద అవుట్ లెట్ నుంచి 5,6 యూనిట్లకు నీరు పంపించడానికి అవసరమైన కండక్టర్ సిస్టం పనులు పనులు ప్రారంభించడానికి పీఈఎస్ కంపెనీ ఏర్పాట్లను చేసుకుంటున్నారని తెలిపారు. ఇంటెక్ డ్యాం వద్ద మెదటిగా సీఈ రాజారావు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో విజయవాడ విద్యుత్ సౌధా హైడల్ సీఈ రవీం ద్రరెడ్డి, ఎస్ఈలు (సివిల్) శ్రీనివాసరెడ్డి, చిన్నకా మేశ్వరరావు, ఈఈలు బాలకృష్ణ, నాగశ్రీనివాస రావు పాల్గొన్నారు.

### నిలిచిన విద్యుత్ ఉత్పత్తి

పొల్లూరు 5,6 యూనిట్లకు నీటి సరఫరా పనులకు కెనాల్ నుంచి నీటి విడుదలను నిలిపివేయడంతో మంగళవారం ఉదయం నుంచి పొల్లూరు, డొంకరాయి జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేశారు.

# గడవాలి పూట.. తప్పదు వేట..


దిత్వా తుఫాన్ ప్రభావం పూర్తిగా తగ్గనేలేదు. కాకినాడ జిల్లా ఉప్పాడ తీరంలో ఈదురుగాలులు వీస్తూనే ఉన్నాయి. చిరుజల్లులు కురుస్తున్నాయి. సముద్రం ఒక మోస్తరు అల్లకల్లోలంగా ఉంది. ఎన్ని ఇబ్బందులున్నా తగ్గేదేలే అంటూ తీరప్రాంతానికి చెందిన మత్స్యకారులు మంగళవారం ఉదయం సముద్రంలోకి వేటకు వెళ్లారు. ప్రతికూల వాతావరణం ఉన్నా పర్వాలేదు ఎంతోకొంత ఆదాయం వస్తే తమకు రోజు గడుస్తుందని చెప్తున్నారు. – కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి)

# ఆహ్లాదకరంగా రెండో రోజు స్కేటింగ్ పోటీలు

కార్పొరేషన్ (కాకినాడ), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ వివేకానంద పార్క్ ఆవరణలోని స్కేటింగ్ రింక్‌లో 69వ అంతర్ జిల్లాల స్కేటింగ్ చాంపియన్‌షిప్ అండర్ 11, 14, 17,19 క్యాటగిరీలలో టోర్నమెంట్ కం సెలెక్షన్స్ పోటీలు రెండో రోజు మంగళవారం ఆహ్లాదకరంగా సాగాయి. ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ అడ్మిన్ సెక్రటరీ పి.సుధారిణి, ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.శ్రీనివాస్, చీఫ్ గెస్ట్‌గా ఐపి మహబూబ్ బాషా, కోకనాడ కోస్టల్ స్పోర్ట్స్ క్లబ్ ఫౌండర్ పి.రవిచంద్ర విజేతలకు మెడల్స్ బహుకరించారు. కార్యక్రమంలో లంక జార్జ్, రాష్ట్ర హాకీ ఫెడరేషన్ సంయుక్త కార్యదర్శి వి.రవి రాజ్ పాల్గొన్నారు.


స్కేటింగ్ చేస్తున్న బాలలు

# కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

## కాకినాడ రూరల్ డిప్యూటీ ఎంపీడీవో-2గా బ్రహ్మాజీ నియామకం

సర్పవరం జంక్షన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం (జీఎస్‌డబ్ల్యూఎస్) డిప్యూటీ ఎంపీడీవోగా బ్రహ్మాజీ నియమితులయ్యారు. ఈయన కాకినాడ జిల్లా పరిషత్ నుంచి ఉద్యోగోన్నతి బదిలీపై వచ్చారు. గ్రామ సచివాలయాలను పర్యవేక్షిస్తారు. ఎంపీడీవో పసుపులేటి సతీష్‌ని ఆయన మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.




శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతులకు లిల్లీ పుష్పాలతో పూజ చేస్తున్న అర్చకస్వాములు, పాదగయలో స్వయంభూ దత్తాత్రేయ స్వామికి సహస్ర చామంతి అర్చన

## మహా సంస్థానంలో సహస్ర లిల్లీ పుష్ప పూజ

పిఠాపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా శ్రీపాదశ్రీవల్లభుల జన్మస్థానంగా ప్రసిద్ధిగాంచిన కాకినాడ జిల్లా పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో శ్రీదత్త జయంతి సప్తాహ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఐదో రోజైన మంగళవారం సహస్ర లిల్లీ పుష్ప పూజ జరిగింది. శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహసరస్వతులకు పుష్పాలతో ప్రత్యేక అలంకారం చేశారు. తొలుత మహాగణపతి పూజ, శ్రీపాదశ్రీవల్లభుల మహిమాన్విత దివ్య పాద పద్మాలకు మహన్యాసపూర్వక ఏకాదశ శతరుద్రాభిషేకం, శ్రీసూక్త, పురుషసూక్తాలతో సహస్ర నామార్చన, రుత్వికులచే దత్త మూలమంత్ర అనుష్టానము, సాయంత్రం అగ్నిప్రతిష్ఠాపన, దత్తమంత్రహోమం, వివిధ హారతులు, స్వామికి పల్లకీ సేవ నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్. సౌజన్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.

**పాదగయలో సహస్ర చామంతి పూజ**

పాదగయ క్షేత్రంలో స్వయంభూగా వెలసిన దత్తాత్రేయ స్వామికి సహస్ర చామంతి పుష్ప పూజ జరిగింది. ఉదయం మహాగణపతి పూజ, కలశస్థాపనలు, రుత్విక్ వరణలు, పంచామృత సహిత రుద్రాభిషేకం, సహస్రనామార్చన, మంగళహారతి, మంత్రపుష్పం, రుత్వికులచే దత్త మూలమంత్ర అనుష్టానం, అగ్నిప్రతిష్ఠాపన, దత్త మూల మంత్ర హోమాలు, మంగళహారతి నిర్వహించారు. పుష్ప పూజ అనంతరం దత్తాత్రేయస్వామిని ప్రత్యేకంగా అలంకరించగా ఈవో కాట్నం జగన్మోహనశ్రీనివాస్, సూపరింటెండెంట్ వీరభద్రరావు, అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.



బెంగళూరు బయల్దేరుతున్న ఉద్యోగులతో డీఆర్వో వెంకట్రావు, వికాస పీడీ లచ్చారావు

## ఉద్యోగాలకు బెంగళూరు పయనం

కాకినాడ సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వికాస ఆధ్వర్యంలో హోసూర్‌లోని టాటా ఎలక్ట్రానిక్స్ కంపెనీలో మొబైల్ ఆపరేటర్ ఉద్యోగాలకు ఎంపికైన 150 మంది మంగళవారం మూడు బస్సుల్లో బెంగళూరు బయల్దేరి వెళ్లారు. బస్సులను కలెక్టరేట్ ఆవరణలో డీఆర్వో జె.వెంకట్రావు, వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె. లచ్చారావు జెండా ఊపి ప్రారంభించారు. డీఆర్వో మాట్లాడుతూ పెద్ద సంఖ్యలో మహిళలకు ఉద్యోగావకాశలు కల్పించి వారికి ఉచిత రవాణా సౌకర్యం ఏర్పాటుచేసిన వికాస పీడీ అభినందనీయులన్నారు. పీడీ లచ్చారావు మాట్లాడుతూ టాటా ఎలక్ట్రానిక్స్ కంపెనీలో ఇప్పటివరకు బ్యాచ్‌ల వారీగా సుమారు 500 మందికి ఉద్యోగావకాశాలు కల్పించామన్నారు. వికాస మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



జెండా ఊపి పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ పద్మశ్రీ

## 'దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలి'

కాకినాడ రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు సామాజికంగా, ఆర్థికంగా రాణించాలని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ కోరారు. కాకినాడ పీఆర్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలో సమగ్ర శిక్షా పాఠశాల విద్యా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం దివ్యాంగులకు జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. వీటిని ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ ప్రారంభించారు. విజేతలకు అతిథులు ప్రతిభా పత్రాలను, పతకాలను అందజేశారు. వారు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని సహిత విద్య జిల్లా సమన్వయకర్త గిరిప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఎస్.లక్ష్మీప్రసన్న, పాల్‌రాజు, కోరమాండల్ సీఎస్ఆర్ ఏజీఎం వంశీకృష్ణ, రాజకుమార్, స్వాతి, పీడీ వెంకటరమణ పాల్గొన్నారు.



ప్రమాణం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

## సిద్ధార్థనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

కాకినాడ సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సిద్ధార్థనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ఎన్నికలు మంగళవారం ఏకగ్రీవంగా జరిగాయి. గౌరవ అధ్యక్షుడిగా వైడీ రామారావు, అధ్యక్షుడిగా తోట సుబ్రహ్మణ్యం, కార్యదర్శిగా టి.శ్రీనివా సరాజా, కోశాధికారిగా బి.త్రిమూర్తులు, ఉపాధ్యక్షులుగా టి.రంగారావు, వైజీకే మూర్తి, బీఎల్‌జీ ప్రసాద్, ఎస్. గోపాల్, సంయుక్త కార్యదర్శులుగా సత్తి రవిరెడ్డి, జి.వెంకటేష్, ఎన్నికయ్యారు. ప్రత్యేక ఆహ్వానితుడిగా బసవా ప్రభాకరరావు, కార్యవర్గ సభ్యులుగా ఎంఎస్ రంగారావు, ఆలపాటి శ్రీనివాస్, ఎ.రమణమూర్తి, వెంకటరావు, సీనియర్ సభ్యులుగా మేక సుబ్బారావు, కొండలరావు, త్రిమూర్తిరావు, మదన్‌గోపాల్, పరమహంస నియమితులయ్యారు. కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం అనంతరం అధ్యక్షుడు సుబ్రహ్మణ్యాన్ని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



తేజశ్రీని అభినందిస్తున్న ఎంఈవో శివరామకృష్ణయ్య

## రాష్ట్ర స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌కు తేజశ్రీ ఎంపిక

సామర్లకోట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు పాఠశాలల విద్యార్థులకు ఇటీవల కౌశల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. పవర జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని నిమ్మన తేజశ్రీ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందని ఎంఈవో వై. శివరామకృష్ణయ్య తెలిపారు. పాఠశాల ఆవరణలో మంగళవారం తేజశ్రీకి అభినందన సభ నిర్వహించారు. హెచ్ఎం ఎంవీ గోపాలరావు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

## అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా పని చేయాలి

**నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనరు సత్యనారాయణ**



కార్పొరేషన్ (కాకినాడ), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా పనిచేయాలని ఇన్‌చార్జి కమిషనరు ఎస్వీవీ సత్యనారాయణ కోరారు. మంగళవారం సాయంత్రం ఆయన స్మార్ట్ సిటీ కార్యాలయ సమావేశ మందిరంలో సచివాలయ సిబ్బంది, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. వివిధ అంశాలపై కీలక ఆదేశాలు జారీ చేశారు. అనధికార కుళాయి కనెక్షన్లను ఈ నెల 10వ తేదీలోపు తప్పనిసరిగా రెగ్యులరైజ్ చేసుకోవాలని ఆదేశించారు. గడువు తీరిన తర్వాత కూడా రెగ్యులరైజేషన్ చేయని కనెక్షన్లకు నీటి సరఫరా నిలిపివేయాలన్నారు. ఎటువంటి నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. ప్రాపర్టీ ట్యాక్స్, వాటర్ ట్యాక్స్ కలెక్షన్లను వేగవంతం చేయడానికి ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని సూచించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ పన్నులు వసూలు చేయాలని, ఖాళీ భూములను గుర్తించి పన్ను తప్పనిసరిగా వసూలు చేయాలన్నారు. పీజీఆర్ఎస్ ఫిర్యాదులను సీరియస్‌గా పరిగణించి సమస్యల పరిష్కారాన్ని స్వయంగా ప్రత్యక్షంగా తనిఖీ చేసి నివేదికలను ఉన్నతాధికారులకు పంపాలన్నారు. ప్రతి వార్డులో సచివాలయ సిబ్బంది స్వచ్ఛత, పచ్చదనం కార్యక్రమాలను చురుగ్గా అమలు చేయాలని కోరారు. నగర పరిశుభ్రతలో ఎవరు నిర్లక్ష్యం చూపినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పురమిత్ర యాప్, సేవలను సమర్థవంతంగా వినియోగించాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. ప్రజలు ఇచ్చే ప్రతి ఫిర్యాదును సమయానుకూలంగా పరిష్కరించేలా అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని కోరారు. పలు విభాగాల అధిపతులు, సచివాలయాల సిబ్బంది, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## రైతు సేవా కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

**పౌరసరఫరాల శాఖ రాష్ట్ర చైర్మన్ తోట సుధీర్**



తేమ శాతం కొలిచే యంత్రాన్ని పరిశీలిస్తున్న సుధీర్

పెద్దాపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ధాన్యాన్ని సాధ్యమైనంత వరకు రైతు సేవ కేంద్రాల్లోనే విక్రయించాలని పౌరసరఫరాల శాఖ రాష్ట్ర చైర్మన్ తోట సుధీర్ పేర్కొన్నారు. మండలంలోని కాండ్రకోటలో ధాన్యం ఆరబెట్టిన కల్లాలను ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ ధాన్యం కొనుగోలుకు గోనె సంచులను అందుబాటులో ఉంచామన్నారు. దిత్వా తుఫాను కారణంగా ధాన్యాన్ని జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని కోరారు. నాణ్యతా ప్రమాణాలున్న ధాన్యాన్ని, కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని సిబ్బందిని ఆదేశించారు. రైతులు ధాన్యం విక్రయంలో ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వచ్చే రబీ సీజనుకు ప్రతి గ్రామంలోనూ ధాన్యాన్ని ఆరబెట్టుకోవడానికి డయ్యర్లు ఏర్పాటు చేస్తామన్నారు. రబీ సీజనుకు యూరియా కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ధాన్యం దళారుల చేతికి చిక్కకుండా ప్రభుత్వం కనీస మద్దతు ధరను రైతుల ఖాతాల్లో తక్షణం జమ చేస్తుందని తెలిపారు. పర్యటనలో మండల వ్యవసాయ అధికారి కె.సంజయ్‌కుమార్, ఆర్ఎస్‌కే సిబ్బంది రాగస్రవంతి, వీఏఏ గణేశ్వరరావు, ప్రవల్లిక, కె.అఖిల్, అమృతవర్షిణి పాల్గొన్నారు.

## గ్రామాల్లో బెల్టు షాపులపై ఎక్సైజ్ అధికారి నిలదీత



గొల్లప్రోలు మండల పరిషత్ సమావేశంలో ఎక్సైజ్ ఎస్ఐను నిలదీస్తున్న ప్రజాప్రతినిధులు

గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గ్రామగ్రామాన మద్యం బెల్టుషాపులు ఉంటే ఎక్సైజ్ అధికారులు ఏంచేస్తున్నారని ప్రజాప్రతినిధులు నిలదీశారు. ఎంపీపీ అరిగెల అచ్చియ్యమ్మ అధ్యక్షతన గొల్లప్రోలు మండల సర్వసభ్య సమావేశం మంగళవారం వాడివేడిగా జరిగింది. ఎక్సైజ్ ఎస్ఐ సూర్యనారాయణ మాట్లాడుతుండగా ఏకే మల్లవరం ఉప సర్పంచ్ అరిగెల మణిబాబు కలుగుజేసుకుని తమ గ్రామంలో మూడు బెల్టుషాపులు ఉన్నాయని తెలిపారు. తమకు అనుమతి ఇస్తే మరో రెండు బెల్టుషాపులు పెట్టుకుంటామని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. బెల్ట్‌షాపులపై ఎప్పటికప్పుడు దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నామని ఎక్సైజ్ ఎస్ఐ తెలిపారు. వన్నెపూడి, దుర్గాడ ఎంపీటీసీలు కందా బాబ్జీ, ఆకుల శ్రీను మాట్లాడుతూ తమ గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోందన్నారు. ప్రతి కిల్లీ దుకాణం బ్రాందీ షాపుగా మారిపోయిందని ఆరోపించారు. ఈ దశలో ఎస్ఐ, సభ్యులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. గ్రామాల్లో యూరియా దొరకట్లేదని, ధాన్యాన్ని సక్రమంగా కొనుగోలు చేయట్లేదని ప్రత్యేక ఆహ్వానితుడు అరిగెల రామయ్యదొర తెలిపారు. భూముల రీసర్వేలో తప్పులను ఇంకా సరిచేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని పలువురు సభ్యులు చెప్పారు. సమావేశంలో మెప్మా పీడీ ప్రియంవద, గొల్లప్రోలు ఎంపీడీవో సెలట్‌రాజు, వైస్ ఎంపీపీ నేమాని ఆదివిష్ణు, బత్తిన మంగ తదితరులు పాల్గొన్నారు.




## సమాచార హక్కు చట్టానికి రెవెన్యూ అధికారుల తూట్లు

పెద్దాపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టానికి తహసీల్దారు కార్యాలయ అధికారులు తూట్లు పొడుస్తున్నారు. సమాచార హక్కు చట్టం బోర్డుపై అధికారుల ఫోను నంబర్లు, పేర్లు కనిపించకుండా తెల్ల కాగితం అతికించారు. కార్యాలయానికి వచ్చే ప్రజలకు కనిపించే విధంగా బోర్డుపై అధికారి, అప్పిలేట్ అధికారుల ఫోన్ నంబర్లు, పేర్లు స్పష్టంగా ప్రదర్శించాలి. కానీ ఇక్కడ అవేమీ కనిపించవు. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఇలా జరుగుతోందని పలువురు విమర్శిస్తున్నారు. గతంలో ఆర్డీవో కార్యాలయ అధికారులను ఓ సామాజిక కార్యకర్త సమాచారం అడిగితే తెల్ల కాగితం పంపించారు.



తాటిపర్తిలో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ఊంజల్ సేవ

## తాటిపర్తిలో ముగిసిన బ్రహ్మోత్సవాలు

గొల్లప్రోలు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి బ్రహ్మోత్సవాలు మంగళవారం ముగిశాయి. చివరిరోజున స్వామి, అమ్మవార్లకు ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం శ్రీపుష్పయాగం జరిగింది. వేద పండితులు ఆకొండి వెంకటేశ్వరశర్మ, ప్రభాకరశాస్త్రి పూజలు జరిపించారు. కమిటీ చైర్మన్ కుంపట్ల సత్యనారాయణ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## 'సమస్యల పరిష్కారానికి కృషి'



మహిళా పాలిటెక్నిక్ కళాశాల భవన శ్లాబ్‌ను పరిశీలిస్తున్న సత్యనారాయణ

కాకినాడ రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలను బీజేపీ భవన నిర్మాణ కమిటీ రాష్ట్ర సభ్యుడు, ఇంజనీర్ గట్టి సత్యనారాయణ మంగళవారం సందర్శించారు. ప్రిన్సిపాల్ కె. సుజాత, అధ్యాపకులు పలు సమస్యలను ఆయనకు తెలపగా వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సివిల్, ఫార్మసీ విద్యార్థులకు అవసరమైన బోధనా పరికరాలు, యూపీఎస్‌ల కొరత ఉన్నందున వాటి కొనుగోలుకు రూ.35వేలు ఇస్తామన్నారు. కళాశాల పూర్వ విద్యార్థి అయిన తన సతీమణి పుష్పాలరాణి ద్వారా ఈ మొత్తాన్ని అందజేస్తానన్నారు. భవనం శ్లాబ్ లీకవుతోందని స్ట్రక్చరల్ ఇంజనీర్ అయిన సత్యనారాయణకు అధ్యాపకులు తెలిపారు. దీంతో ఆయన భవనాన్ని, శ్లాబ్‌ను పూర్తిగా పరిశీలించారు. గ్రౌటింగ్ చేసి అపాక్సీ, రెయిన్‌గార్డు ద్వారా మరమ్మతులు చేయిస్తే శ్లాబ్ లీక్ అవదన్నారు. ఆర్ఎస్ఎస్ శత వసంతాలు పూర్తిచేసుకున్న తరుణంలో హిందుత్వాన్ని ప్రజలకు చేరువచేయడమే లక్ష్యంగా బీజేపీ చేపట్టిన ప్రత్యేక కార్యాచరణను అధ్యాపకులకు వివరించారు. శత వసంతాల సంచికలు, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు రమేష్‌బాబు, బాలనాగవేణి, ఉషశ్రీ, వెంకటేశ్వరరావు, శుభారాణి పాల్గొన్నారు.

## 'రైతులకు కూటమి ప్రభుత్వం అండ'



చీడిగలో తడిసిన ధాన్యాన్ని ఎమ్మెల్యే నానాజీకి చూపిస్తున్న ఒక రైతు

కాకినాడ రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ కారణంగా తడిసిన ధాన్యాన్ని కొవ్వాడ, గంగనాపల్లి, కొవ్వూరు, రేపూరు గ్రామాల రైతులు జాతీయ రహదారిపై రాశులుగా వేసుకున్నారు. వాటిని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ మంగళవారం సాయంత్రం పరిశీలించారు. రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని, ధాన్యం తడిసిపోకుండా కాపాడుకునేందుకు టార్పాలిన్లు అందజేస్తున్నామన్నారు. ఎవరూ అధైర్యపడవద్దని, ప్రభుత్వం ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందన్నారు. కూటమి నాయకులు, పలువురు రైతులు వున్నారు.

## 'ఆహారంలో నాణ్యత లోపిస్తే చర్యలు'



ఆహార నాణ్యత ఎలా ఉందని ప్రజలను అడిగి తెలుసుకుంటున్న ఇన్‌చార్జి కమిషనరు

సర్పవరం జంక్షన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పేదల కడుపు నింపే అన్న క్యాంటీన్లలో ఆహార నాణ్యతపై రాజీపడేదే లేదని, లోపిస్తే చర్యలు తప్పవని కాకినాడ నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనరు ఎస్వీవీ సత్యనారాయణ స్పష్టం చేశారు. సోమవారం ఆయన రమణయ్యపేట మార్కెట్ సమీపంలో గల అన్న క్యాంటీన్‌ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలు అల్పాహారం స్వీకరిస్తుండగా... రుచి, నాణ్యతపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. చట్నీ నాణ్యంగా లేదని పలువురు చెప్పడంతో నిర్వాహకులపై అసహనం వ్యక్తం చేశారు. ఆహారం నాణ్యత, శుభ్రత విషయాల్లో ప్రమాణాలు తగ్గితే ఏమాత్రం ఉపేక్షించేది లేదన్నారు. హెల్త్ ఆఫీసర్ డాక్టర్ డి.పృథ్వీరాజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆర్.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

## 'సీఐటీయూ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయండి'

పెద్దాపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు కోసం అందరూ కలిసి ఉద్యమించాలని ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు చింతల సత్యనారాయణ పిలుపునిచ్చారు. కార్మిక వర్గాన్ని ఐక్యం చేస్తున్న సీఐటీయూ అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలన్నారు. పట్టణంలోని యాసలపు సూర్యారావు భవనంలో ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ విస్తృత సమావేశాన్ని తాడిశెట్టి గంగ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. పెద్దిరెడ్ల విష్ణు, జోకా సూర్యనారాయణ, దివిలి శ్యామ్, బూసారి శ్రీను, షేక్ ఇబ్రహీం, కాకి దుర్గ, ఉప్పల ఉమామహేశ్వరరావు, షేక్ బాషా, కట్టా నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ ఉద్యోగాలకు ఈ నెల 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో పి.రమేష్ ఒక ప్రకటనలో కోరారు. అర్హత గల అభ్యర్థులు సంబంధిత మండల విద్యా శాఖాధికారులకు దరఖాస్తు సమర్పించాలని సూచించారు.

## కొత్తపల్లి మండలంలో...

**కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి):** మండలంలో ఖాళీగా ఉన్న ఐదు ఉపాధ్యాయ పోస్టులను ప్రభుత్వ నోటిఫికేషన్ ద్వారా విద్యా వలంటీర్లతో భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎంఈవోలు బుర్రా వేణుగోపాల్, జి. పైడిరాజు ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ, డీఈడీ అర్హతతో టెట్ పాసైన అభ్యర్థులు 2025-26 సంవత్సరంలో ఐదు నెలలు పని చేయడానికి ఈ నెల 5వ తేదీలోగా దరఖాస్తు పూర్తి చేసి కొత్తపల్లి ఎమ్మార్సీ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఖాళీలు ఇలా... యండపల్లి శివారు రామచేంద్రనగర్ ప్రాథమిక పాఠశాల-ఎస్జీటీ, కుతుకుడుమిల్లి శివారు కలవలదొడ్డి ప్రాథమిక పాఠశాల-ఎస్జీటీ, నాగులాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల-స్కూల్ అసిస్టెంట్ (హిందీ), కోనపాపపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల-స్కూల్ అసిస్టెంట్ (హిందీ), వాకతిప్ప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల-స్కూల్ అసిస్టెంట్ (బయలాజికల్ సైన్స్). మరిన్ని వివరాలకు కొత్తపల్లి ఎంఈవో కార్యాలయంలో సంప్రదించాలి.

## నేడు ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ వేడుకలు

కాకినాడ సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం ఉదయం 10 గంటలకు జేఎన్టీయూ అలూమ్ని ఆడిటోరియంలో ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్టు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకుడు ఏవై శ్రీనివాస్ తెలిపారు. ఈ విభిన్న ప్రతిభావంతులు, వారి కోసం పని చేస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని ఒక ప్రకటనలో కోరారు.

## ఎకో క్లబ్ ఆధ్వర్యంలో ర్యాలీ

కలెక్టరేట్ (కాకినాడ), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జగన్నాథపురంలో గల అన్నవరం సత్యవతీదేవి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్రం, ఎకో క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ అనంతలక్ష్మి... పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచడానికి, సుస్థిరమైన భవిష్యత్తు కోసం అవసరమైన కార్యాచరణను విద్యార్థులకు వివరించారు. అనంతరం నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఎస్. మాధవి, జి.సౌజన్య, జి.పావని, డాక్టర్ అనిత, డాక్టర్ ఝాన్సీలక్ష్మి, లీన, సులక్షణ, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

## టీడీపీ నేత శ్రీకాంత్‌కు మంత్రి లోకేశ్ అభినందన



సామర్లకోట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురం నియోజకవర్గంలో టీడీపీ పార్టీ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రచారం చేయడంలోను, పార్టీని మరింత బలోపేతం చేయడంలో సామర్లకోట పట్టణ శాఖ అధ్యక్షుడు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్ చేస్తున్న కృషి అభినందనీయమని మంత్రి నారా లోకేశ్ కొనియాడారు. రెండు రోజుల శిక్షణ తరగతుల్లో పాల్గొనేందుకు మంగళగిరిలోని టీడీపీ రాష్ట్ర కార్యాలయానికి మంగళవారం శ్రీకాంత్ చేరుకున్నారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఇచ్చిన సమాచారంతో ఆయన్ను లోకేశ్ అభినందించారు.



## విద్యార్థులకు కంటి పరీక్షలు

గొల్లప్రోలు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మాధురి విద్యాలయ, మాధురి జూనియర్ కళాశాలల్లో కిరణ్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో రెండు రోజులు నిర్వహించిన ప్రత్యేక కంటి వైద్య శిబిరాలు మంగళవారం సాయంత్రం ముగిశాయి. ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది 2,500 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. తక్కువ దృష్టిలోపం ఉన్న వారికి కళ్లజోళ్లు అందజేశారు. ఇతర చికిత్స అవసరమైన వారిని కాకినాడ ఆసుపత్రికి మరిన్ని పరీక్షలకు రిఫర్ చేశారు. శిబిరాన్ని మాధురి విద్యా సంస్థల అధినేత కడారి తమ్మయ్యనాయుడు, సీతాదేవి, ప్రిన్సిపాల్ మాధవి పర్యవేక్షించగా గొల్లప్రోలు ఎంఈవోలు వెన్నా శ్రీనివాస్, శివప్రసాద్ పరిశీలించారు.

## 7న కొత్తపల్లి మండల సమావేశం

కొత్తపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 7వ తేదీన నిర్వహించనున్నట్టు ఎంపీడీవో లక్ష్మీరెడ్డి తెలిపారు. ఎంపీపీ కారే సుధాశ్రీనివాసరావు అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు మొదలయ్యే సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల అధికారులు విధిగా హాజరుకావాలని కోరారు.

### జగ్గంపేటలో వర్షం

జగ్గంపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మంగళవారం ఉదయం నుంచి జగ్గంపేట పట్టణంలో ఒక మోస్తరు వర్షం కురిసింది. వాతావరణంలో మార్పుల దృష్ట్యా రైతులు తమ భూములు చదును చేసుకుని దాల్వా పంటకు సిద్ధమవుతున్నారు. అయితే వాతావరణంలో మార్పుల వల్ల దగ్గు, రొంప, జ్వరం వంటి వ్యాధులతో నియోజకవర్గ ప్రజలు ఆసుపత్రుల చుట్టూ వైద్యం కోసం తిరుగుతున్నారు.

# జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

# రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

## కలెక్టర్ దృష్టికి గిరిజనుల సమస్యలు

● కలెక్టర్‌తో చర్చించిన శిరీషదేవి



కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీషదేవి

రంపచోడవరం, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం పర్యటనకు విచ్చేసిన అల్లూరిజిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్‌ను మంగళవారం ఎమ్మెల్యే, లెజిస్లేటివ్ చైర్మన్ మిరియాల శిరీషదేవి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎమ్మెల్యే, ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్ గిరిజన ప్రాంత అభివృద్ధిపై చర్చించారు. పందిరిమామిడి-చవిటిదిబ్బలు, పీఎం కోట-ఆకుమామిడికోట రోడ్లు, ఎత్తిపోతల పథకంద్వారా గిరిజన రైతులకు సాగునీరు అందేలా చర్యలు, గిరిజనుల సాగులో ఉన్న కొండపోడు భూములకు పట్టాలు మంజూరు, రంపచోడవరంలో డ్రైనేజీ ఏర్పాటు, నూతన అంగన్వాడీ కేంద్రాలకు భవనాలు ఏర్పాటుచేయాలని కోరుతూ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. సమస్యలు పరిష్కరించేలా చర్యలు చేపడుతామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

### టీఎన్‌యూఎస్ జిల్లా అధ్యక్షుడిగా వెంకటేశ్వరరావు



రంపచోడవరం, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): అల్లూరిజిల్లా తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం(టీఎన్‌యూఎస్) జిల్లా ఉధ్యక్షుడిగా లండవెంకటేశ్వరరావు నియమితులయ్యారు. ఈమేరకు మంగళవారం సంఘ రాష్ట్ర కమిటీ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా కత్తుల ఆదిరెడ్డి, ట్రైబల్ వెల్ఫేర్ టీచర్స్ కన్వీనర్‌గా కోలాటి ఎలీషా నియమితులయ్యారు.

### ఆర్అండ్ఆర్ కాలనీ ఏర్పాటుకు భూమి సేకరణ

రంపచోడవరం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): చింతూరు డివిజన్‌లోని పోలవరం ముంపునకు గురైన గిరిజనులకు గంగవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి మండలాల్లో ఆర్అండ్ఆర్ కాలనీల ఏర్పాటుకు 4 వేల ఎకరాల భూమిని సేకరించనున్నట్టు అల్లూరి సీతారామరాజుజిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక పీఎంఆర్‌సీలో ఆయన మాట్లాడుతూ త్వరలో రంపచోడవరంజిల్లా కేంద్రం కానున్నందున అధికారులు, సిబ్బందికి నివాస గృహాలు ఏర్పాటుకు నివేదికలు సిద్ధం చేసి సమర్పించాలని గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ.శ్రీనివాసరావును ఆదేశించారు.

### ట్రైబల్ హెల్త్ కౌన్సిల్ సేవలు వినియోగించుకోండి

వీఆర్‌పురం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) షేరిన్ అల్లూరి ట్రైబల్ హెల్త్ కౌన్సిల్ సొసైటీ సేవలు వినియోగించుకోవాలని సంస్థ సభ్యులు తెలిపారు. ఈసందర్భంగా స్వచ్ఛంద సంస్థ సభ్యులు మంగళవారం వీఆర్‌పురం ఎంపీడీవో ఇమ్మానియల్‌ను మండల పరిషత్ కార్యాలయంలో కలసి మాట్లాడారు. గ్రామాల్లో విషజ్వరాలు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా షేరిన్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు ప్రజలకు అవగాహన కల్పిస్తామని ఎంపీడీవోకు తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు వైద్య సిబ్బంది మా సంస్థకు సహకరించాలని కోరాలు అందుకు ఎంపీడీవో సానుకూలంగా స్పందించారని సంస్థ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు ఎం.రమేష్‌బాబు, బొర్ర రామారావు, రేవు దుర్గాప్రసాద్, భూమిక, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

### 'పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి'



సీఐటీయు ఆధ్వర్యంలో ఎర్రంపేట జీసీసీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న జీసీసీ కార్మికులు

చింతూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): జీసీసీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. ఈ క్రమంలో మంగళవారం ఎర్రంపేట జీసీసీ కార్యాల యం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడారు. జీసీసీ పర్యవేక్షణ నుంచి సివిల్ సప్లైలోకి జీసీసీ సేవలు మార్పిడి చేయడంతో కార్మికులకు చెల్లించాల్సిన వేతనాల చెల్లిం పుల్లో జాప్యం చోటుచేసుకోవడం జరుగుతుందన్నారు. గతంలో వారానికి ఒకమారు వేతనాలు చెల్లిస్తున్నారన్నారు. వేతనాలు చెల్లింపుల్లో జాప్యం చోటు చేసుకోవడంతో కార్మికుల కుటుంబాలు ఇక్కట్లను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికే రూ.5లక్షల మేర బకాయిలు పేరుకు పోయాయ న్నారు. సకాలంలో వేతనాలు చెల్లించాలని లేని పక్షంలో పోరాటం తీవ్రతరం చేస్తామని ఆయన హెచ్చరించారు. గిరిజన సంఘం జిల్లా నాయకుడు సీసం సురేష్, కార్మికులు అయ్యప్పస్వామి, రాఘవయ్య, భీష్మారావు, మంగరాజు పాల్గొన్నారు.

### అన్నదాత ఆందోళన



టార్పాలిన్‌తో వరికుప్పకు కప్పిన దృశ్యం

మోతుగూడెం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెంలో ద్విత్ తుఫాన్ ప్రభావంతో మన్యంలో ముసురు పట్టింది. సోమవారం రాత్రి నుంచి చిరుజల్లు కురుస్తు న్నాయి. గిరి రైతులు వరి నూర్పులను తాత్కాలికంగా వాయిదా వేసుకున్నా రు. కల్లాల్లో వరి కుప్పను పేర్చి టార్పాలిన్‌లను కప్పారు. మోతుగూడెం పరిసర ప్రాంతాలలో వర్షంతో రైతులంతా ఆందోళనలు చెందుతున్నారు. కొంతమంది రైతులు వరిచేను కోసేశారు. మరికొందరు రైతులు మినప పంట తీసేశారు పనలు తడిచిపోవడంతో రైతులంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు

## ఆదమరిస్తే అంతే సంగతులు

● గోతులమయంగా తోటపల్లి శివారు ప్రాంతం



గుంతలో కర్రలపై ఎర్రటి కవర్ ఏర్పాటు చేసిన దృశ్యం

ఎటపాక, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): భద్రాచలం-కూనవరం రోడ్‌లోని ఎటపాక మండలం తోటపల్లి గ్రామ శివారు ప్రాంతంలో ప్రధా న రహదారిపై పడిన గుంత ప్రమాదకరంగా దర్శనమి స్తోంది. వాహనదారులు ఎవరైనా ఈగుంతను గమనించక ఆదమరిస్తే ప్రమాదం బారినట్లేనన్న విధంగా పరిస్థితి ఏర్పడింది. అయితే ఇది గమనించిన కొందరు బాటసారులు ఇతరులకు, వాహన దారులకు ప్రమాదం జరుగకుండా ముందుగా గుర్తించే ందుగానూ గుంతలో నాలుగు వైపుల కర్రలు ఏర్పాటుచేసి, వాటిపై ఎర్రటి ప్లాస్టిక్ కవర్ ఉంచారు. ఈ రహదారిపై మనరాష్ట్రంతోపాటు చత్తీస్‌గడ్, తెలంగాణ వైపునుంచి కూడా వాహనాలు రాకపోకలు నిత్యం సాగుతూ ఉంటాయి. సంబంధిత అధికారులు స్పందించి మర మ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

### పాఠశాల భవనానికి శంకుస్థాపన

వై.రామవరం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి):వై.రామవరం ఎంపీపీ పాఠశాల ఆవరణలో పాఠశాల భవన నిర్మాణానికి మంగళవారం కూటమి నాయకుల ఆధ్వ ర్యంలో శంకుస్థాపన చేశారు. టీడీపీ సీనియర్‌నేత రెడ్డి సత్యనారాయణ, బీజేపీ నాయకులు, హెచ్‌ఎం గంగాధర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### భూ కబ్జాలపై చర్యలు తీసుకోండి

అడ్డతీగల, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి):మండలంలో తిమ్మాపురంలో మంగళవారం ఆదివాసీ సంక్షేమ పరిషత్ అడ్డతీగల, రాజవొమ్మంగి మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజ శ్రీను మాట్లాడుతూ అడ్డతీగల, రాజవొమ్మంగి మండలాల పరిధిలో ఆదివాసీ భూములు విచ్చలవిడిగా కబ్జాకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

# ప్రజల సంపూర్ణ మద్దతుతో తుని అభివృద్ధి

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు

యనమల రామకృష్ణుడు

టీడీపీలోకి వైసీపీ నాయకుల చేరిక



తేటగుంటలో టీడీపీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న యనమల

తుని రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజల సంపూర్ణ మద్దతు ఉంటే నియోజకవర్గం మరింత అభివృద్ధి పథంలో నడుస్తుందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు స్పష్టం చేశారు. తేటగుంట టీడీపీ క్యాంప్ కార్యాలయంలో సీనియర్ నాయకుడు యనమల రాజేష్ అధ్యక్షతన దళిత వర్గాలకు చెందిన పలువురు వైసీపీ నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేసి యనమల సమక్షంలో టీడీపీలోకి చేరారు. రావికంపాడు గ్రామానికి చెందిన పులుగు వీరబాబు, దాడల సింహాచలం, నొక్కి సూరిబాబులతో పాటు పలువురికి యనమల పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ పార్టీలో నూతన ఉత్సాహంతో పని చేసి గ్రామాల అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని కోరారు. రానున్న స్థానిక ఎన్నికల్లో ప్రజల నుంచి సంపూర్ణ మద్దతు కూటగట్టి కూటమి అభ్యర్థిని అఖండ మెజార్టీతో గెలుపొంచుకోవాలన్నారు. ఎమ్మెల్యే దివ్య చొరవతో ప్రతి గ్రామాన్ని స్మార్ట్‌గా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుగా వెళుతున్నామని, ప్రతీ గ్రామంలో పూర్తిస్థాయి మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు. తొండంగి మండల సీనియర్ టీడీపీ నాయకులు ఉన్నారు.



సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

### తొండంగిలో సెమీ క్రిస్మస్ వేడుకలు

తొండంగి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తొండంగి చర్చిలో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. పాస్టర్ పావని ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. క్రిస్మస్ ప్రాముఖ్యతను పావని వివరించి క్రీస్తు సువార్తను వినిపించారు. విశ్వాసులున్నారు.

### పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

గండేపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు మంగళవారం గ్రామంలో విస్తృతస్థాయి పరిశుభ్రత, ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పరిశుభ్రమైన జీవన విధానం సమాజ ఆరోగ్యాన్ని ఎలా కాపాడుతుందో ప్రజలకు వివరించారు. టైఫాయిడ్, డెంగ్యూ వంటి వ్యాధులు అపరిశుభ్రమైన నీరు, దోమల పెంపకం, చెత్త పేరుకుపోవడం ద్వారా ఎలా వ్యాపిస్తాయో ప్రజలకు తెలిపారు.

### 'భగవద్గీత మానవాళికి అవసరం'



తుని రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సృష్టిలో ప్రథమ దైవ గ్రంథం భగవద్గీత అని త్రైతా సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదికసభ్యుడు కాంతరాజు తెలిపారు. తుని మండలం హంసవరంలో భగవద్గీత, అనుబంధ గ్రంథాల పరిచయ కార్యక్రమాలు నిర్వహించారు. మొదటి ప్రథమ దైవ గ్రంథం భగవద్గీత ప్రపంచంలోని మానవాళికి అవసరమని తెలిపారు.

## రామచంద్రపురంలో మహా అన్న సమారాధన



అన్నదానానికి హాజరైన తుమ్మలబాబు, నాయకులు

కిర్లంపూడి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో రామచంద్రపురంలో శ్రీ సుబ్రహ్మణేశ్వర స్వామి షష్ఠి మహోత్సవాల ముగింపు సందర్భంగా ఆలయం వద్ద తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్, సర్పంచ్ తుమ్మలపల్లి సాయి గుణశేఖర్, జనసేన పార్టీ స్టేట్ ప్రోగ్రామింగ్ కమిటీ కోఆర్డినేటర్ తుమ్మలపల్లి సాయి చందు పర్యవేక్షణలో మంగళవారం మహా అన్న సమారాధన నిర్వహించారు. పలు గ్రామాల ప్రజలు భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ తోట సుధీర్, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, కాకినాడ పార్లమెంట్ ఎలక్షన్ ఇంచార్జ తోట నవీన్, ఏలేరు ప్రాజెక్టు చైర్మన్ బస్వా వీరబాబు, మాజీ జగ్గంపేట మార్కెట్ కమిటి చైర్మన్ జనపరెడ్డి బాబు, ఎంపీపీ తోట రవి, జడ్పీటీసీ తోట గాంధీ, గోకేడ రాజా, దొడ్డా శ్రీను, ఆత్మ కమిటి చైర్మన్ పైడిపాల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## కిర్లంపూడిలో ఉచిత ఆధార్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం



ఆధార్ నమోదు కార్యక్రమ దృశ్యం

కిర్లంపూడి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల మహిళ సమాఖ్య కార్యాలయంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, పరిశ్రమల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత ఉద్యమ ఆధార్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహించారు. డీఆర్డీఏ డీపీఎం బాబురావు, నాన్ ఫామ్ ఏపీఎం విజయలక్ష్మి, ఇండస్ట్రియల్ డిపార్ట్మెంట్ సందీప్, ఏపీఎం ఎస్.వేదకుమారి, సీసీలు ఎన్.బుల్లియ్య, వై.లోవరాజు, ఎన్.శాంతా, ఎమ్ఎస్‌వోబీలు ప్రేమ జ్యోతి, నాగలక్ష్మి, అకౌంటెంట్ సంధ్య, వీవో ఏలు, తదితరులు పాల్గొన్నారు.



రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కూటమినేతలు

### ఎమ్మెల్యే సత్యప్రభ కృషిని మరువలేం

రౌతులపూడి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): తమ గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభకు రుణపడి ఉంటారని లచ్చిరెడ్డి పాలెం, ఎస్.ఎన్.పట్నం గ్రామాల కూటమి నాయకులు లాలం అప్పలనాయుడు, అల్లం ప్రసాద్ అన్నారు. లచ్చిరెడ్డిపాలెం, ఎస్ఎన్ పట్నం గ్రామాల రోడ్డుకు పంచాయతీరాజ్ నిధులు రూ.1.06 కోట్లు మంజూరయ్యాయి. ఈ రహదారి పనులను మంగళవారం కూటమి నేతలు ప్రారంభించారు. గత ప్రభుత్వంలో ఈ రహదారి అధ్వానంగా ఉందని ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ఎమ్మెల్యే సత్యప్రభ ఈ రహదారికి నిధులు మంజూరు చేయించడంపై హర్షం వ్యక్తం చేశారు.




వేళంగిలో ర్యాలీ నిర్వహిస్తున్న సమరసత ఫౌండేషన్ సభ్యులు

### ధర్మాన్ని ప్రచారం చేయడమే లక్ష్యం

శంఖవరం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రతీ గడపకూ ధర్మాన్ని ప్రచారం చేయడమే సమరసత ఫౌండేషన్ లక్ష్యమని ధర్మప్రచారక్ పడాల రాంబాబు అన్నారు. మంగళవారం సమరసత ఫౌండేషన్ పదో వార్షికోత్సవం సందర్భంగా వేళంగిలో ధర్మ ప్రచారాన్ని నిర్వహించి భక్తి గీతాలు ఆలపించారు. అనంతరం ఆయా వీధుల్లో తిరుగుతూ జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేస్తూ భక్తి గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో వరహాలబాబు, జలుమూరు సోమాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

### స్టాండింగ్ కౌన్సిల్‌గా దేవి



ఏలేశ్వరం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా అవసరాల దేవి ఎంపికయ్యారు. ఆమె ఈ పదవిలో మూడేళ్ల పాటు కొన సాగుతారు. నగర పంచాయతీకి సేవలంది స్తారని అధికారులు తెలిపారు.

## అకాల వర్షంతో రైతుల్లో కలవరం



ప్రత్తిపాడు జాతీయ రహదారిపై కురుస్తున్న వర్షం

ప్రత్తిపాడు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా మండలంలో భారీ వర్షం కురిసింది. మండలం వ్యాప్తంగా వరి నూర్పిడులతో పాటు, వరి కోతలను రైతులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురుస్తుండటంతో ఆయా ప్రాంతాల్లోని వరి పనలు ముద్దయ్యాయి. ఏలూరు, రాయవరం, ప్రత్తిపాడు, పెదశంకర్లపూడి, చినశంకర్లపూడి, ఉత్తరకంచి, పెద్దిపాలెం తదితర గ్రామాల్లో వరి పంటకు నష్టం వాటిల్లింది. ఉదయం నుంచి రాత్రి వరకు విరామం లేకుండా చినుకులు పడటంతో జాతీయ రహదారితో పాటు మండల రహదారులు చిత్తడిగా మారాయి. దీంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

## నెరవేరనున్న గిరిజనుల కల



కూటమి నేతలకు పాలాభిషేకం చేస్తున్న గిరిజనులు

శంఖవరం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి చేస్తున్న గిరిజనుల పోరాటం ఫలించనుందని గిరిజన నేతలు అన్నారు. మంగళవారం గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేష్ చిత్రపటాలకు గిరిజనులు పాలాభిషేకం చేశారు. ప్రత్తిపాడు, తుని నియోజకవర్గాల్లోని 59 గ్రామాలతో పెదమల్లాపురం కేంద్రంగా ఐటీడీఏ ఏర్పాటు అనివార్యమని ఎంపీ, ఎమ్మెల్యేల కార్యాలయాల నుంచి ప్రకటన రావడంతో గిరిజనుల్లో హర్షం వ్యక్తమవుతోందన్నారు. జనసేన మండల అధ్యక్షుడు గాబు సుభాష్ ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, ఎంపీ తంగెళ్ళ ఉదయశ్రీనివాస్‌లకు గిరిజనులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో భూసార పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

### భూసార పరీక్షల ఆవశ్యకత తెలుసుకోవాలి

శంఖవరం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలోనే భూసార పరీక్షల ఆవశ్యకత తెలుసుకోవాలని వ్యవసాయాధికారి పి.గాంధీ అన్నారు. మంగళవారం స్థానిక ఆదర్శ పాఠశాల విద్యార్థులతో భూసార పరీక్షలు జరిపి వాటి ఆవశ్యకతను వివరించారు. మట్టి నమూనాలు సేకరించే విధానం తెలిపారు. విద్యార్థులు అన్ని అంశాలపై కనీస అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వీర్రాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### 'దైవ మార్గాన్ని అనుసరించాలి'




కొవ్వొత్తులతో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ తదితరులు

ఏలేశ్వరం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రజలంతా భక్తితో దైవ మార్గాన్ని అనుసరించాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. మంగళవారం విజయబాబు ప్రార్థనా మందిరంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే హాజరై కేక్ కట్ చేసి సెమీ క్రిస్మస్ వేడుకలను ప్రారంభించారు. క్రైస్తవులు కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు. ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి, కౌన్సిలర్లు అలమండ చలమయ్య, మూది నారాయణ స్వామి, బొదిరెడ్డి గోపి, పలువురు క్రైస్తవులు పాల్గొన్నారు.

### అదుపుతప్పి తుప్పల్లోకి దూసుకెళ్లిన స్కూల్ బస్సు

విద్యార్థులు సురక్షితం

గండేపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో నాయకంపల్లి గ్రామ శివారులో సామర్లకోటకు విద్యార్థులను తీసుకెళ్తున్న స్కూల్ బస్సు అదుపుతప్పి పక్కనే ఉన్న తుప్పల్లోకి దూసుకెళ్లింది. బస్సు స్టీరింగ్ మరమ్మతులకు గురవ్వడంతో ఘటన జరిగింది. డ్రైవర్ కంట్రోల్ చేయడంతో విద్యార్థులకు ఏ ప్రమాదం జరగలేదని స్థానికులు తెలిపారు.

### డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో అన్నదానం

జగ్గంపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జగంపేట పోలీస్‌స్టేషన్ ఆవరణలో జనసేన పార్టీ జగ్గంపేట ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ క్యాంటీన్ నిర్వహించారు. జనసేన నాయకులు సుమారు 500 మంది పేదలకు అన్నదానం నిర్వహించారు.

### రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



శ్రీనివాస్ (ఫైల్)

తుని రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తునిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. కోటనందూరు మండలం జగన్నాధపురం గ్రామానికి చెందిన ఎల్‌వీఎస్ శ్రీనివాస్ (52)ను 5రోజుల కిందట స్థానిక రామా థియేటర్ సమీపంలో ఆటో ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కాకినాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. శ్రీనివాస్ పలుపత్రికల్లో జర్నలిస్టుగా పనిచేశాడు.

### తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్న ఆర్యవైశ్య డైరెక్టర్

జగ్గంపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శ్రీవారిని రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్, కోటనందూరు మండలం యూత్ కమిటీల పరిశీలకులు కొత్త వెంకటేశ్వరరావు (కొండబాబు) కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం ఉదయం దర్శించుకున్నారు. వీఐపీ విరామ సమయంలో స్వామిసేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శ నానంతరం ఆలయ రంగనాయకుల మం డపంలో వారికి వేద పండితులు వేదాశీర్వచనం అందించగా, ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేసి పట్టువస్త్రంతో సత్కరించారు.



తిరుమలలో కొండబాబు కుటుంబం



రాచపల్లి అరుణాచలేశ్వర ఆలయంలో బసవేశ్వరుడికి పాలాభిషేకం చేస్తున్న భక్తులు

### బసవేశ్వరుడికి పాలాభిషేకం

ప్రత్తిపాడు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాచపల్లి అరుణాచలేశ్వర ఆలయంలో బసవేశ్వరుడికి మంగళవారం పాలాభిషేకాలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు స్వామి రామానంద ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య అభిషేకాలు నిర్వహించి, పంచ హారతులిచ్చారు. జనసేన నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ వరుపులతమ్మయ్యబాబు దంపతులు, కుటుంబ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

### అంబులెన్స్‌లో ఆరునెలల గర్భిణి ప్రసవం

● తల్లీ, బిడ్డ క్షేమం

ప్రత్తిపాడు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): అంబులెన్స్‌లో ఆరు నెలల గర్భిణి మంగళవారం మగబిడ్డకు జన్మనిచ్చింది. శంఖవరం మండలం కొంతంగి గ్రామానికి చెందిన తూరంగి సుహాసిని ఆరునెలల గర్భిణి. మంగళవారం సుహాసినికి నొప్పులు రావడంతో అంబులెన్స్‌లో ప్రత్తిపాడు ఆసుపత్రికి తరలిస్తున్నారు. మార్గమధ్యలో పురిటి నొప్పులు అధికం కావడంతో అంబులెన్స్ సిబ్బంది సహాయంతో ఆమె మగబిడ్డకు జన్మనిచ్చింది. శిశువులో స్పందనలు లేకపోవడంతో ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ సౌమ్య షైబెల్ పీహెచ్‌సీలోని ఎస్ఎన్‌సీయూలో శిశువును తరలించారు. శిశువు సాధారణస్థితికి రావడానికి చికిత్సలు అందించారు. కాగా శిశువు 800 గ్రాములు బరువు ఉన్నాడని వైద్యాధికారి వివరించారు.

### ఒకేచోట విద్యుత్ లైట్లు

ఏలేశ్వరం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పలు ప్రాంతాల్లో వీధిలైట్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్న ఉదంతాలు ఎన్నో ఉన్నాయి. ఈ విషయంపై స్థానికులు అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకువెళ్లినా పట్టించుకునే నాథుడే ఉండడు. విషయానికి వస్తే...ఏలేరు ప్రాజెక్ట్ రోడ్డులో సాయిబాబా మెట్టకు వెళ్లే దారిలో ఒకేచోట ఐదు స్తంభాలకు తొమ్మిది లైట్లు వేశారు. దీనిపై పట్టణ వాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ సిబ్బంది నిర్వాకంపై స్థానికులతో పాటు పలువురు వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నరు. వీధి లైట్లు లేనిచోట వీటిని ఏర్పాటు చేస్తే ఎంతో ఎంతో ఉపయోగ పడుతుందని వారు వ్యాఖ్యానిస్తున్నారు.